వరంగల్ వార్త
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు
శుక్రవారం14, అక్టోబర్, 2022 16 పేజీలు

## ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా చర్యలు

జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య




16లో..

# లారీకి లక్ష ప్రజలకు శిక్ష

- అక్రమాలలో నెం.1గా వరంగల్ రవాణా శాఖ
- ముచ్చటగా ఏడాదికి రూ.3కోట్లు వసూలు
- గ్రానైట్ లారీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- వరంగల్, ఖమ్మం రహదారిలో నిత్యం ప్రమాదాలు
- పాపపు సొమ్ముతో ప్రజల రక్షణ మరిచిన అధికారులు
- ఓవర్ లోడ్లతో ఆనవాళ్లు కోల్పోతున్న ఆర్ అండ్ బీ రోడ్లు




ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, వరంగల్

యావత్ తెలంగాణలో అక్రమాలలో వరంగల్ రవాణా శాఖ అగ్రస్థానంలో నిలుస్తోంది. ప్రయివేట్ ఏజెంట్లతో నిత్యం మూటగట్టుకునే పాపపు సొమ్ము చాలదన్నట్లుగా ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టడంలో కూడా నూతన అధ్యాయాన్ని లిఖించింది. గ్రానైట్ క్వారీల యజమానులతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా కోట్లు కూడబెడుతూ నిత్యం ప్రమాదాలకు రవాణా శాఖ అధికారులే కారణం కావడం కంచే చేను మేసినట్లుగా ఉంది. జిల్లాలో గ్రానైట్ లారీలు మూడు వందలకు పైగా ఉండగా లారీల టైర్ల లెక్కన ఏడాదికి లక్ష నుంచి 50 వేల వరకు ముందే మూటగట్టుకోవడం వరంగల్ రవాణా శాఖ అధికారులకే చెల్లింది. అధికారులకు అందే ముడుపుల మాట ఎలా ఉన్నా ఓవర్ లోడ్లతో రోడ్లు ధ్వంసం అవుతుండడం.. నిత్యం ప్రమాదాలు జరుగుతుండడం జిల్లా ప్రజల పాలిట శాపంగా మారింది.

2 లో..

# ఆగని పోడు భూముల సర్వే వివాదం

- బొల్లెపెల్లిలో రెండవ రోజు ఉద్రిక్తత
- సర్వేను బహిష్కరిస్తాం: అటవీ ఉద్యోగుల సంఘం
- సర్వే ఆపితే ఆత్మహత్యలే: రైతుల ఆందోళన
- రైతులతో మాట్లాడిన ఎఫ్‌డిఓ, ఆర్డీఓ



2లో...

గూడూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త

మండలంలోని బొల్లెపెల్లి గ్రామంలో తలెత్తిన పోడు భూముల సర్వే వివాదం రెండవ రోజు కూడా కొనసాగింది. రైతులు పోడు చేసుకుంటున్న భూముల్లో గురువారం అటవీ సిబ్బంది పెద్దెత్తున మోహరించారు. ఇది చూసి రైతులు కూడా మహిళలతో సహా అక్కడికి చేరుకోవడంతో ఏం జరుగుతుందోనన్న ఉద్విగ్న పరిస్థితి కొన్ని గంటలపాటు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా

ఓరుగల్లులో రెచ్చిపోతున్న..

# గ్యాంగ్‌స్టర్

- పుడమిని చీల్చుడు, గుప్తనిధులు దోచుడు
- పురాతన దేవాలయాలు, కోటగోడలే టార్గెట్
- రాత్రి వేళల్లో తవ్వకాలు
- దుండగులతో దోస్తీ కడుతున్న అధికార పెద్దలు
- నిధులు దొరికితే తలాయింత
- నివారించడంలో అధికారులు, పోలీసులు వైఫల్యం



2లో...

ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ:

పుడమి తల్లి ఒడిలో ఒదిగి ఉన్న నిధి నిక్షేపాలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులతో పాటు ప్రజలపైన ఉంది. చారిత్రాత్మకమైన ఓరుగల్లు ఉమ్మడి

## నర బలా..? జంతుబలా..?

- బలపడుతున్న అనుమానాలు
- స్థానికుల అస్త్రం ఉందా..?
- దుండగులు తీసిన గోతిని ఎందుకు పూడ్చినట్లు..?

2లో...

# లారీకి లక్ష.. ప్రజలకు శిక్ష

**(మొదటి పేజీ తరువాయి..)**

అక్రమాలతో అపవాదును మూటగట్టుకున్న వరంగల్ రవాణా శాఖ నానాటికీ బరితెగిస్తోంది. ప్రైవేట్ ఏజెంట్లతో ఇప్పటికే నిబంధనలకు పాతరేసిన అధికారులు కార్యాలయం వెలుపల కూడా కళ్ళు చెదిరే అక్రమాలకు తెరలేపారు. కార్యాలయంలో జరిగే నిత్య దోపిడీ జగమెరిగిన సత్యమే కాగా గ్రానైట్ లారీల సాక్షిగా అక్రమ రవాణాకు అనుమతిస్తూ యావత్ రాష్ట్రంలోనే అక్రమాలలో ఆరితేరిపోయారు. వాహన రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు తదితర సేవలు ఇప్పటికే తాము నియమించుకున్న ఏజెంట్ల ద్వారా ప్రభుత్వ ఫీజులను పక్కనపెట్టిన అధికారులు చివరకు ప్రజల ప్రాణాలు తీసే ఓవర్‌లోడ్ లారీలకు వంత పాడుతూ ఉద్యోగ ధర్మాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. ప్రజల రక్షణే ప్రధాన ధ్యేయంగా పనిచేయాల్సిన రవాణా శాఖ ప్రమాదాలను పెంచిపోషించే రీతిలో వ్యవహరిస్తుండటం సంబంధిత ఉన్నతాధికారుల ఉదాసీనతను ఎత్తి చూపుతోంది. వరంగల్ జిల్లాలో అధికంగా గ్రానైట్ క్వారీలు ఉండగా నిత్యం వందకు పైగా లారీలు ఓవర్‌లోడ్‌తో ఖమ్మం వెల్తుంటాయి. వరంగల్ జిల్లాలో మరో వంద లారీలు నిత్యం తిరుగుతుంటాయి. ఐతే గతంలో జిల్లాలో పనిచేసిన అధికారులు ఓవర్‌లోడ్ లారీలపై కఠినంగా వ్యవహరించటం ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడటానికే పెద్దపీట వేశారు. కానీ గత రెండేళ్లుగా ప్రభుత్వ రహదారులను గ్రానైట్ కంపెనీలకు వ్రాసిచ్చినట్లుగా ప్రస్తుత అధికారులు వ్యవహరిస్తుండటంతో అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రధానంగా జిల్లాలో 300లకు పైగా లారీలు ఉండగా వాటిలో 150 లారీలో ఖమ్మం, వరంగల్ నడుమే నిత్యం ఓవర్ టన్నేజీతో భారీ గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్నాయి. వీటి వల్ల ఇప్పటికే ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగగా ఓవర్‌లోడ్‌లతో ఖమ్మం, వరంగల్ రోడ్లు ఆనవాళ్లు కోల్పోయిన విషయం విదితమే. అయితే ఓ వైపు రోడ్ల ధ్వంసం అవుతుండగా, మరోవైపు ప్రమాదాలు జరుగుతుండగా ఇవేమీ పట్టని రవాణాశాఖ అధికారులు తమకు అందే ముడుపులే ముఖ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 300 లారీలు ఉండగా టైర్ల లెక్కన భారీ వాహనాల నుండి నెలకు 10వేలు, మధ్యతరగతి వాహనాల నుండి ఎనిమిది వేలు, చిన్నపాటి వాహనాల వద్ద ఐదువేల చొప్పున అనధికారికంగా ఒక పట్టిక కూడా పెట్టేశారు. ఈ చీకటి ఒప్పందం ద్వారా నెలకు 15 నుండి 20లక్షల వరకు టంచన్‌గా వసూలు చేస్తున్నారంటే ఇక్కడ జరుగుతున్న అక్రమం ఏ స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు నియమించుకున్న ఏజెంట్లు ప్రతినెలా 10వ తారీఖు లోపున ఈ వసూళ్ల ప్రక్రియ పూర్తిచేసి నగదు ముట్టజెప్పటం ఓ తంతుగా మారిపోయింది. వరంగల్, ఖమ్మం నడుమ తిరిగే గ్రానైట్ లారీల విషయంలో ఇరు జిల్లాల అధికారులు జాయింట్‌గానే కలెక్షన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే ఆర్టీఏ కార్యాలయంలో బ్రోకర్ల ద్వారా అధికారులు చేసే అక్రమాలు అందరికీ తెలిసినవే అయినా చివరకు ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మృత్యు శకటాల్లా ప్రజల ప్రాణాలు తీస్తున్న ఓవర్‌లోడ్ వాహనాలకు చీకటి బేరాల సాక్షిగా యధేచ్ఛగా అనుమతులివ్వడం సదరు అధికారులకే చెల్లింది. ఆర్టీఏ కార్యాలయంలో అక్రమాలు ప్రభుత్వానికి సైతం తెలిసిన భాగోతమే అయినా ఇలా ప్రమాదాలకు కారణమయ్యే వాహనాల విషంలో సంబంధిత అధికారులు చేసుకుంటున్న చీకటి ఒప్పందాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఓరుగలుల్లో రెచ్చిపోతున్న గ్యాంగ్‌స్టర్

**(మొదటి పేజీ తరువాయి..)**

జిల్లాలో కాకతీయ రాజులు ఓరుగల్లు నగరంతో పాటు పలు పల్లెల్లో నిర్మించిన పురాతన దేవాలయాలు, కట్టడాలనే టార్కెట్‌గా చేస్తూ గుప్త నిధుల వేటగాళ్లు యదేచ్ఛగా పల్లెల్లో తవ్వకాలు జరుపుతూ గుప్త నిధులను దోచేస్తున్నా నివారించడంలో అధికార యంత్రాంగంతో పాటు పోలీసులు వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలు ఓరుగల్లు జిల్లాలో వెల్లువెత్తుతున్నాయి. దుండగులతో అధికార పెద్దలు దోస్తీకట్టి తలాయింతా పలహారంలా పంచుకుంటున్నారన్న ప్రచారం జిల్లాలో జోరుగా ఉపందుకుంది. నెల రోజుల వ్యవధిలోనే జిల్లాలో పల్లెల్లో పదుల పలు చోట్ల తవ్వకాలు జరిపి గుప్త నిధులను మింగేస్తున్నా సంఘటనలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. ఓరుగల్లు జిల్లాలోని గీసుగొండ మండలం, గంగదేవిపల్లెలో భారీ ఎత్తున తవ్వకాలు జరిపి గుప్తనిధులు భారీగా వెలికితీసి పంచుకుంటున్న తరుణలో తలెత్తిన వివాదాలతో గుప్త నిధుల గుట్టు బహిర్గతమైన విషయం తెలిసిందే. కాగా ఇటీవలనే గత శనివారం రాత్రి వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామంలో ఎస్సారెస్పి కెనాల్ సమీపంలో గల పురాతన శివాలయం ప్రాంగణంలో రాత్రి వేళల్లో దుండగులు జేసిబిలతో 12 ఫీట్ల లోతుతో భారీ తవ్వకాలు జరిపగా పురాతనమైన బంగారపు లంకెబిందెలు లభ్యమైనట్లు అట్టి లంకెబిందెలను ఆటోలతో సహా జెసిబిని అదే రాత్రి వరంగల్ రంగశాయిపేటవైపు తరళించినట్లు పోలీసులు, గ్రామస్తుల సహకారంతో సీసీ పొటేజిల ద్వారా బహిర్గతమైనట్లు తెలుస్తుంది. కాగా తీగరాజుపల్లిలో భారీగా గుంతలు తీసి దుండగలు వెంటనే పూడ్చడంతో గుప్త నిధులు తీయడం కోసం అందులో జంతువును, లేదా నరునైన్నా బలిచేశారా...? అని తీగరాజుపల్లి గ్రామస్తులు అనుమానం, భయాందోళను వ్యక్తం చేస్తూన్నారు. ఇట్టి గుప్పనిధుల తవ్వకాల సంఘటనలో భాగస్వాములైనట్లు అధికార పార్టీ పెద్దల, ప్రజా ప్రతినిధుల సహకారం ఉన్నట్లు తీగరాజుపల్లి గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా తీగరాజుపల్లి గ్రామ సర్పంచ్, గ్రామ యువకుల, ప్రజల ఫిర్యాదు మేరకు సంగెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంఘటన జరిగి మూడు రోజులైనప్పటికి సీసీ పొటేజిలో వాహనాలు స్పష్టంగా తీగరాజుపల్లి నుండి వరంగల్ వైపు వెళ్లినప్పటికి దుండగులను వాహనాలను పట్టుకోవడంలో పోలీసులు అధికారులు వైఫల్యం చెందారన్న వార్తలు ప్రజల నుండి వినవస్తున్నాయి. కాగా గంగదేవిపల్లి గుప్తనిధుల సంఘటన మాదిరిగానే తీగరాజుపల్లి గుప్త నిధుల మాయంలో అధికార పెద్దల ప్రజాప్రతినిదుల హస్తం ఉన్నట్లు తీగరాజుపల్లి పరిసర గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ఇదే వారంలో ఘనపురం మండలంలో పురాతన కోటుగుళ్ల మధ్యలో గుప్తనిధుల కోసం యదేచ్ఛగా దుండగులు తవ్వకాలు జరిపారు. ఓరుగల్లు నగరంలో సైతం పురాతన దేవాలయాలను టార్గెట్‌గా చేసుకొని గుప్త నిధుల వేటను యదేచ్ఛగా దుండగులు కొనసాగిస్తున్నారని, రాత్రి వేళల్లో పల్లెల్లో దుండగులు జరుపుతున్న తవ్వకాలతో పల్లె ప్రజలు బంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రంగంతో పాటు పోలీసు యంత్రాంగం గుప్త నిధులను కాజేస్తున్న గ్యాంగ్‌స్టార్స్‌ను గుర్తించి వారిపై చట్ట రిత్య చర్యలు తీసుకోవాలని దుండగులకు పరోక్షంగా సహకరిస్తున్న అధికార పెద్దలు, ప్రజాప్రతినిధులపై సైతం చట్టరిత్య చర్యలు తీసుకోవాలని ఓరుగల్లు ప్రజలు జిల్లా యంత్రాంగాన్ని, పోలీసు ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# నర బలా..? జంతుబలా..?

**ప్రభాతవార్త, సంగెం, అక్టోబర్ 13**

ఇటీవల వరంగల్ ఉమ్మడి జిల్లాలో కలకలం రేపిన గుప్త నిధుల తవ్వకాలు ఈ నెల 8న శనివారం అర్థరాత్రి వరంగల్ జిల్లా సంగెం మండల పరిధిలోని తీగరాజు పల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ మేయిన్ వద్ద గల కాకతీయుల కాలం నాటి శివాలయం, లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయముల మధ్యలోని నాగమయ్య పుట్ట వద్ద సుమారు 15 ఫీట్ల వెడల్పు, 5 ఫీట్ల పొడవు, 6 ఫీట్ల లోతుతో జేసీబీ మిషన్‌తో గుప్త నిధుల కోసం భారీగా గోతి తవ్విన ఘటన ఉమ్మడి జిల్లాలోనే సంచలనం సృష్టించింది. ఈ నిధుల డంపు ఘటన గీసుగొండ మండలం గంగాదేవి పల్లిలో జరిగిన తరహాలోనే జరిగినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తుంది. తీగరాజుపల్లి గ్రామంలో జరిగిన గుప్త నిధుల ఘటన నేటికి 7 రోజులు కావస్తున్నా దీనిపై పోలీస్ శాఖ చేస్తున్న జాప్యంపై సంగెం మండల ప్రజలకు మరింత బలమైన అనుమానస్పదాలకు దారి తీస్తున్నాయి. దుండగులు తవ్విన గోతి మట్టిని పూడ్చిన ఘటనపై స్థానిక ప్రజలకు చుట్టూ ప్రక్క తండా వాసులకు పలురకాల అనుమానాలు రేకెతిస్తున్నాయి. దుండగులకు నిధులు దొరికినట్లయితే వారు అత్యంత ఉత్సాహంతో గోతిని పూడ్చకుండా హడాహుడీగా వెళ్లిపోయేవారు. ఒక వేళ ఏది దొరకకపోయినట్లయితే గోతిని పూడ్చకుండానే నిరుత్సాహంతో వెళ్లేవారని కానీ వారికి నిధులు కనిపించగానే ఈ సమయంలో జంతు బలి ఇచ్చారా లేకా..? నర బలిని ఇచ్చిన ఆనవాళ్లు కనిపించకుండా మట్టిని పూడ్చి జేసీబీ టైర్లతో తొక్కించిన ఆనవాళ్లు ఉండడంతో దుండగులు భారీ ఎత్తున నిధులు పట్టుకెళ్లినట్లు స్థానిక ప్రజల్లో మరింత లోతుగా బలంగా అనుమానాలు కలుగుతున్నాయని గ్రామస్థుల వాదన.

# ఆగని పోడు భూముల సర్వే వివాదం

ఉన్న అటవీరేంజిల సిబ్బంది ఒక్కసారిగా గ్రామానికి చేరుకొని పోడు భూముల వద్ద తిష్ట వేయడంతో తమ పంటలను ఏంచేస్తారోనన్న ఆందోళనతో రైతులు ఆ ప్రాంతానికి పరుగులు తీసారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు కూడా అప్రమత్తమై అక్కడికి చేరుకున్నారు. బొల్లెపెల్లి గ్రామానికి చెందిన పోడు రైతులు పలువురు తాము సాగుచేసుకుంటున్న భూముల పక్కనే ఉన్న అటవీశాఖ నూతన ప్లాంటేషన్‌లో ఎదుగుదలలో ఉన్న కొన్ని మొక్కలను నరికివేసిన సంఘటనను అటవీ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. గ్రామంలో పోడు భూముల సర్వేను జరిపేదిలేదంటూ తేల్చి చెప్పడంతో ఈనెల 12న ఈ వ్యవహారం వివాదాస్పదమైన విశయం తెలిసిందే. మొక్కలు ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప సర్వేను ఎలా ఆపుతారని రైతులు అధికారులను నిలదీసిన విశయం కూడా తెలిసిందే. ఈ క్రమంలో చోటు చేసుకున్న వాదోపవాదాల అనంతరం గ్రామంలో సర్వేను యదావిధిగా కొనసాగించడం జరుగుతుందని అటు పోలీసు అధికారులతో పాటు తహసిల్దార్ వెల్లడించారు. ప్లాంటేషన్ ధ్వంసం సంఘటనపై మహబూబాబాద్ ఎఫ్ఆర్వో జ్యోత్స్న అదేరోజ రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసారు. ఇంతవరకు బాగానే ఉన్నా తెల్లవారే సరికే మళ్లీ పెద్ద సంఖ్యలో అటవీ అధికారులు, సిబ్బంది మోహరించడంతో కథ మొదటికొచ్చింది. అటు రైతులు, ఇటు అటవీ సిబ్బంది మోహరించిన తర్వాత మహబూబాబాద్ ఎఫ్‌డిఓ కృష్ణమాచార్యులు, ఆర్డీఓ కొమురయ్యలు ప్లాంటేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ గ్రామ సర్పంచ్‌తో పాటు రైతులతో మాట్లాడారు. ప్లాంటేషన్‌లో మొక్కలు నరికివేయడం చట్ట పరంగా నేరమని, దీనిపై చర్యలు తప్పవని స్పష్టం చేసారు. సర్వే జరిగే సమయంలో ఇలాంటి చర్యలకు పాల్పడడం భాధాకరమన్నారు. 25 ఎకరాల ప్లాంటేషన్‌లో పదెకరాల మేర ధ్వంసం చేసారని, ప్లాంటేషన్‌ను ధ్వంసం చేసి ఆ భూములకు ఆర్ఓఎఫ్ఆర్ కింద హక్కు పత్రాలు పొందే కుటిల యత్నానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా పోడు రైతులు చేసుకున్న ధరఖాస్తుల ప్రకారం సర్వే చేపట్టి అర్హులైన వారికి హక్కు పత్రాల కోసం సిఫారసు చేస్తామని, అయితే జిల్లా ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు మరోసారి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఇకపై ప్లాంటేషన్ జోలికి రామని అధికారుల ముందు రైతులు స్పష్టం చేయగా జరిగిన నష్టానికి భాధ్యులెవరంటూ అటవీ అధికారులు ప్రశ్నించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకే తాము ఇక్కడి పరిస్థితిని సమీక్షించేందుకు వచ్చామని, దీనిపై వారికి నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డిఓ, ఆర్డీఓ స్పష్టం చేసారు. ఆ తర్వాత అధికారులు అక్కడి నుండే వెళ్లే ప్రయత్నం చేయగా పోడు రైతులు మరోమారు వారిని అడ్డగించారు. వాహనాలకు అడ్డుపడి పురుగుమందు, పెట్రోల్ బాటిల్స్‌తో రోడ్డుపై బైఠాయించారు. తమ గ్రామంలో పోడు భూముల సర్వే ఆపి, తమకు హక్కు పత్రాలు రాకుండా చేసే ప్రయత్నానికి పాల్పడితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని, అధికారులు తమకు స్పష్టమైన హామీని ఇచ్చి వెళ్లాలని డిమాండ్ చేసారు. దీంతో ఆర్డీఓ కొమురయ్య మరోమారు రైతులతో మాట్లాడి నచ్చచెప్పారు. సర్వే తప్పకుండా చేపట్టడం జరుగుతుందని, అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన రైతులందరికీ హక్కు పత్రాలు వచ్చేలా చూస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. ఆర్డీఓ, ఎఫ్‌డిఓలతో పాటు గూడూరు తహసిల్దార్ అశోక్‌కుమార్, సిఐ యాసిన్, ఎస్ఐ సతీష్‌గౌడ్, మహబూబాబాద్, గంగారం ఎఫ్ఆర్వోలు జ్యోత్స్న, చలపతిరావు పాల్గొన్నారు.

# పోడు సర్వేను బహిష్కరిస్తాం

## అటవీ ఉద్యోగుల సంఘం

**గూడూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

హక్కు పత్రాలు పొందాలనే దురాలోచనతో ప్లాంటేషన్లను కావాలని ధ్వంసం చేస్తున్న పరిస్థితుల్లో మహబూబాబాద్ జిల్లాలో పోడు సర్వేను అటవీశాఖ సిబ్బంది బహిష్కరిస్తున్నట్లు జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సాంబు, బాలనాగులు స్పష్టం చేసారు. అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా కూడా సర్వేలను బహిష్కరించేందుకు కూడా వెనుకాడబోమన్నారు. మండలంలోని బొల్లెపెల్లి వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. అర్హులైన పోడు రైతులకు హక్కు పత్రాలు ఇచ్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియలో భాగంగా తాము ఒకవైపు కష్టపడి సర్వేలు నిర్వహిస్తుంటే మరోవైపు కొంతమంది తమ స్వార్థం కొరకు ప్లాంటేషన్లు ధ్వంసం చేస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడడం చట్ట విరుద్ధమన్నారు. ప్లాంటేషన్లు ధ్వంసం చేయడం వల్ల కష్టపడి సర్వే చేస్తున్న అటవీ సిబ్బంది పైన దాని ప్రభావం పడుతుందని, జరిగిన నష్టాన్ని సిబ్బంది వేతనాల్లో కోతలు పెడతారని అన్నారు. తమకు నష్టం జరిగే విధంగా వ్యవహరించినప్పుడు తాము సర్వే చేయడమెందుకని ప్రశ్నించారు.

# సర్వే ఆపితే ఆత్మహత్యలు చేసుకుంటాం

తమ గ్రామంలో పోడు భూముల సర్వేను ఆపితే తాము పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని, ఊరు వల్లకాడవుతుందని మండలంలోని బొల్లెపెల్లి గ్రామానికి చెందిన పోడు రైతులు ఆక్రోషించారు. బొల్లెపెల్లి గ్రామంలోని పోడు భూములను, ప్లాంటేషన్ సందర్శించేందుకు వచ్చిన అధికారులను అడ్డుకొని తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. చేతుల్లో పెట్రోల్ బాటిళ్లు, పురుగుమందు సీసాలు పట్టుకొని తమకు స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ఇక్కడే ఆత్మహత్యలకు పాల్పడతామని గొడవకు దిగారు. గతంలో ఇక్కడి భూములన్నీ నాయిని గోపాలకృష్ణారెడ్డి పేరున పట్టా అయి ఉన్నాయని, మధ్యలో అటవీశాఖవారు వాటిని ఆక్రమించుకొని అటవీ భూములుగా ముద్ర వేసారని ఆరోపించారు. రెండేళ్ల క్రితం నుండే ప్లాంటేషన్ చేస్తున్నారని, అంతకు ముందు ఈ భూములను ఇక్కడి రైతులు సాగు చేసుకొని జీవించారని అన్నారు. ఎవరో ఒకరిద్దరు ప్లాంటేషన్‌లో చెట్లు ధ్వంసం చేస్తే మొత్తం సర్వేనే నిలిపివేస్తామని అటవీ అధికారులు చెప్పడం సరైంది కాదన్నారు. ప్లాంటేషన్ ధ్వంసం చేసిన వారిని గుర్తించి బుధవారం నాడే పోలీసులకు అప్పగించినా గురువారం మళ్లీ పెద్ద సంఖ్యలో అటవీ అధికారులు గ్రామానికి చేరుకొని తమను భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు.

# తపాల శాఖ కొత్త పథకం

### -తక్కువ ప్రీమియం-ఎక్కువ ప్రయోజనం
### -రూ.399తో రూ.10 లక్షల భీమా

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



తపాల శాఖ సరికొత్త పథకంను అమలుకు శ్రీకారం చుట్టింది. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం కలిగించే విధంగా ఒక కొత్త ప్రమాద భీమాను అమలు చేసింది. రూ. 399 చెల్లించటం ద్వారా ఏడాది పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షల చెల్లించనున్నారు. అనారోగ్యం భారిన పడితే ఆరోగ్య భీమా ఆసుపత్రి ఖర్చులను చెల్లిస్తుంది. కాని ప్రమాదం జరిగినప్పుడు పాక్షికంగా వైకల్యం, లేదా శాశ్వత వైకల్యం పొందవచ్చు లేదా ఆ వ్యక్తి మరణించవచ్చు. ఇలాంటి పరిస్థితి ఎదురయినప్పుడు వ్యక్తిగత భీమా అండగా నిలుస్తుంది.

అందుకోసం తపాల శాఖ ప్రమాద భీమాను గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ పేరుతో కొత్త పథకను ఇటీవల ప్రారంభించింది. ఏడాదికి రూ. 399 చెల్లిస్తే రూ. 10 లక్షల భీమా వర్తిస్తుంది. ఈ పథకంలో చేరే వారు తప్పకుండా పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపిపిబి) ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ ప్రీమియంతో అనేక ప్రయోజనాలు కల్పించారు.

**-పాలసీ ప్రయోజనాలు........**

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ తన కస్టమర్లకు గ్రూప్ యాక్సిడెంట్ భీమా పాలసీని అందిస్తోంది. 18 నుండి 65 ఏళ్ల మద్యలో వయస్సు కలిగిన వారు ఈ భీమా పాలసీ తీసుకోవచ్చు. ఆదార్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ పాలసీని తీసుకునే అవకాశం ఉంది. ప్రమాదంలో మరణించినా, శాశ్వత వైకల్యం ఏర్పడినా అవయవాలు కోల్పోయినా రూ. 10 లక్షలు చెల్లిస్తారు. ప్రమాదం జరిగి పాలసీ తీసుకున్న వ్యక్తి వైద్యం కోసం ఆసుపత్రిలో చేరితే ఐపిడి కింద రూ. 60 వేలు, ఔట్ పేషెంట్‌కు రూ. 30 వేలు ఇస్తారు. ఇంకా పాలసీ తీసుకున్న వారికి ఇతర బెనిఫిట్స్ కూడా ఉన్నాయి. విద్య ప్రయోజనాలకు గరిష్టంగా ఇద్దరు పిల్లలకు రుసుములో 10 శాతం లేదా రూ. లక్ష వరకు ఎంచుకోవచ్చు. కుటుంబ ప్రయోజనాలకు రూ. 25 వేలు, అంత్యక్రియలకు రూ. 5 వేలు అందిస్తారు. పథకంలో మరో ఐచ్చికం కింద ఏడాదికి రూ.299 చెల్లిస్తే మృతి, పక్షవాతం, వైకల్యం, వైద్య ఖర్చుల కోసం నిభందనల మేరకు బాధిత కుటుంబ సభ్యులకు ఇస్తారు.

**-సద్వి నియోగం చేసుకోవాలి..... భూక్య విజయ్, భూపాలపల్లి పోస్టల్ ఇన్స్‌పెక్టర్**

ప్రమాద భీమా ప్రతి ఒక్కరికి అవసరమే అని తపాల శాఖ ఈ పాలసీని అమలు చేస్తున్నది. హన్మకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని సబ్, బ్రాంచీ పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలి. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు, టాటా ఏఐజీ ద్వారా ప్రమాద భీమాను గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ పేరుతో కొత్త పథకను అందుబాటులోకి తీసుకువచ్చింది. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలను పొందవచ్చు. సమీపంలోని తపాల కార్యాలయంకు వెళ్లి ఈ పాలసీని తీసుకునే అవకాశం ఉంది.

## నేరాలు-దారుణాలు

## అనారోగ్యం దృష్ట్యా సర్పంచ్ ఏడు రోజుల సెలవు

*కాటారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

అనారోగ్యం కారణం దృష్ట్యా ఏడు రోజుల సెలవు గురించి రేగులగూడెం సర్పంచ్ దోమ రాహూల్ గురువారం కాటారం ఎంపిడిఓకు వినతిలో పేర్కొన్నట్లు సర్పంచ్ రాహూల్ ప్రకటనలో పేర్కొన్నారు. అనారోగ్య కారణం చేత ఏడు రోజుల పాటు ప్రజలకు ఉండలేక పోతున్నట్లు వినతిలో పేర్కొన్నారు. కావున ఏడు దినముల సెలవును మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నట్లు సర్పంచ్ రాహూల్ తెలిపారు.

## రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

*కాటారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

నేటి నుండి రేపటి వరకు కాటారం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 132/కేవి/33కేవి సబ్‌స్టేషన్ కాటారం పరిధిలో కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్ రావు, పలిమెల మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని విద్యుత్ శాఖ కాటారం ఏడిఈ డి.నాగరాజు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 220కేవి మేడిగడ్డ లైన్ పునరుద్ధరణలో భాగంగా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు అంతరాయం వాటిల్లుతుందని తెలిపారు. కావున సంబంధిత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీని చేసిన అధికారులు

*మహాముత్తారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లి, పోలారం, పర్లపల్లి గ్రామాలలో ఉన్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు జిల్లా మత్స్యశాఖ అధికారులు గురువారం ఉచిత చేప పిల్లలను అందజేశారు. ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షులు, యామన్‌పల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ అటెంట రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ..జూలై, ఆగష్టు నెలలో కాకుండా ఇప్పుడు ఇస్తే చేప పిల్లలు ఎలా పెరుగుతాయని అధికారులకు అడిగారు. వచ్చే సంవత్సరం నుండి అయినా జూలై, ఆగష్టు నెలలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, రైతుబంధు మండల అధ్యక్షుడు మార్క రాము గౌడ్, మత్స్య సహకార సంఘం డైరెక్టర్‌లు, సభ్యులతో కలిసి కొత్త చెరువులో చేప పిల్లలను వదిలారు. మహేదంర్, రాజబాపు, చంద్రయ్య, శ్రీనివాస్, వెంకటస్వామి, సంపత్, రజాకర్, వెంకన్న పాల్గొన్నారు.

## దళిత వాడల సమస్యలు పట్టించుకోరా...!

### -కేవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఇసునం మహేందర్

*కాటారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఒడిపిలవంచ గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లీపూర్ ఎస్సీ వాడలో రోడ్డుపై గత కొన్ని నెలలుగా నీరు నిలుస్తున్న పట్టించుకునే నాధుడు కరువయ్యాడని కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ అన్నారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ..వర్షపు నీరు, డ్రైనేజీ నారు కిందికి వెళ్లే మార్గం లేక రోడ్డుపై కాలనీ వాసుల గుమ్మాల ముందర నిలుస్తుందని అన్నారు. ఇంటిలో నుండి కాలు బయట పెట్టలేని పరిస్థితిలో కాలనీ వాసులు ఉన్నారన్నారు. దీంతో దోమలకు స్థావరాలుగా ఏర్పడి అనేకమంది రోగాల భారిన పడిపోతున్నారన్నారు. దళిత వాడలు కాబట్టే ఏఅధికారి కూడా పట్టించుకోవడం లేదని మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు పరిష్కారం కానీ యెడల కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని అన్నారు.

### అర్హులైన పోడు రైతులకు
## న్యాయం చేయండి

### -తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

*మల్హర్‌రావు, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



అర్హులైన పోడు రైతులకు న్యాయం చేయాలని మండలకేంద్రమైన తాడిచర్ల, కాపురం రైతులు గురువారం తహశీల్దార్ జివాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..అర్హులైన తమ పేర్లు ఆన్‌లైన్లఓ రాలేదని,త మ పేర్లను ఆన్‌లైన్లఓ నమోదు చేసి పోడు భూముల సర్వేలో అవకతవకలు జరుగకుండా చర్యలు తసీఉకుని న్యాయం చేయాలని కోరారు. కాపురం శివారులో గత నాలుగు రోజులుగా తాము పోడు చేసి సేద్యం చేస్తున్న భూముల వద్ద అధికారుల కోసం పడిగాపులు కావస్తున్నామని అయినా అధికారులు ఎవరూ కూడా తమభూముల వద్దకు రాకపోవడంతో ఈవిషయంపై అధికారులను అడుగగా తమ పేర్లు ఆన్‌లైన్‌లో లేవని తెలిపారన్నారు. అర్హులైన తమ పేర్లు రాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోనగిరి ఓదేలు, మాచనవేణి మహేష్, ఆకుల ఓదేలు, బోనగిరి తిరుపతి, చిగిరి శ్రీనివాస్, కుంట శ్రీకాంత్, సమ్మయ్య, ఆకుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

*మొగుళ్లపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ వ్యక్తి మీతి చెందిన సంఘటన మండలంలోని పిడిసిల్ల గ్రామాంలో చోటుచేసుకుంది. ఎస్ఐ జె.శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు..పిడిసిల్ల గ్రామానికి చెందిన మాదారపు భద్రయ్య(57) గత నాలుగు సంవత్సరాల క్రితం భార్య చనిపోగా ఒక్కడే స్వగ్రామంలో ఉంటున్నాడు. భద్రయ్య కొడుకు హైదరాబాద్‌లో ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోంగ చేస్తున్నాడు. గత సంవత్సరం నుండి భద్రయ్యకు ఆరోగ్యం బాగా లేక కీళ్ల నొప్పులతో బాధ పడుతుండేవాడని ఆబాధ తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 11న రాత్రి గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజిఎం హస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

### యువజన కాంగ్రెస్ తాడిచర్ల
## గ్రామ కమిటీ ఎన్నిక

*మల్హర్‌రావు, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



యువజన కాంగ్రెస్ పార్టీ తాడిచర్ల గ్రామ కమిటీని ఏఐసిసి కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రమైన తాడిచర్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాడిచర్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మేనం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇందారపు శంకర్, కోశాధికారిగా సిద్ధు, కార్యదర్శులుగా శివాజీ, బొంతల కార్తీకన, సలీం, శేనం రవి, కార్యవర్గ సభ్యులుగా కుంట రమేష్, నీలం గోపి, మేనం రాజు, సంపత్, కోట సాయి, బొబ్బిలి సాయి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, నాయకులు మేనం సత్యనారాయణ, కుంట సదయ్య, పైడాకుల సమ్మయ్య, నర్సింగ రావు, యువజన నాయకులు బొబ్బిలి రాజు గౌడ్, అర్ని ఉదయ్, ఇందారపు ప్రబాకర్, దుర్గా ప్రసాద్, మొగిలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 40క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

*రేగొండ, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



మండలంలోని నిజాంపల్లి గ్రామానికి చెందిన కేశవసాయి రైస్ మిల్లులో 40క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారి వాసుదేవా రెడ్డి, స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం ఉదయం 3గంటల ప్రాంతంలో పటు ్టకున్నట్లు వెల్లడించారు. ఈమేరకు కేశవ సాయి రైస్ మిల్లు యజమాని బోల్లబోయిన రమేష్, రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి బెల్లం శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో వాసుదేవ రెడ్డి, థామస్, స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.




## పారిశుద్ధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టండి -కమీషనర్ శేషు

పరకాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త



పట్టణంలోని ప్రధాన మార్గాలతో పాటు వీధుల్లో కూడా పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళికాబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన పట్టణ వాతావరణంపై సిబ్బంది అంతా దృష్టి సారించాలని మున్సిపల్ కమీషనర్ శేషాంజన్‌స్వామి సూచించారు. స్థానిక 3, 9వ వార్డు, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వాహణ పనులు కమీషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని వీధుల్లో పారిశుద్ధ్య నిర్వాహణ సరిగా లేదని సిబ్బందిపై కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా జాగ్రత్తలు వహించాలని, అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని కమీషనర్ సిబ్బందికి ఆదేశించారు. తమకు కేటాయించిన వార్డులోనే శానిటేషన్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. రోజు డ్రైనేజీలు, రోడ్లు క్లీన్ చేయించాలని తెలిపారు. రోడ్డు మధ్యలోని మీడియన్ మొక్కలకు ఎరువులు, వాటర్ స్ప్రేయర్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణచారి, మున్సిపల్ అధికారులు గంజి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

పరకాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త



తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుండి టిఆర్ఎస్(బీఆర్ఎస్)లో చేరుతున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో గీసుగొండ మండలం సూర్యతండా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ టిఆర్ఎస్ (బీఆర్ఎస్) గ్రామ పార్టీ నాయకులు అజ్మీరా వినోద్, బానోతు వీరన్న, బానోతు నర్సింగం, సర్పంచ్ వాంకుడోతు బాలరాజు, ఆధ్వర్యంలో పరకాల శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి సమక్షంలో టిఆర్ఎస్(బీఆర్ఎస్)లో చేరారు. వారికి గులాభీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ జాతీయ పార్టీ ప్రకటణతో ఆయా రాష్ట్రాల ముఖ్య నేతలు, ప్రజలు పెద్ద ఎత్తున సీఎం కేసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా సీఎం కేసిఆర్‌కు ఉన్న ప్రజాదారణ, ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు టిఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు బలహీణ పడుతుందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు కంపెనీలకు ధారదత్తం చేస్తుందని, ఆదానీ, అంబానీలు కంపెనీలకు కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తూ బడాబాబుల కొమ్ము కాస్తుందని ధర్మారెడ్డి చెప్పారు. బడుగు బలహీణ వర్గాల అభ్యున్నతికి కేసిఆర్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందనీ, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చిల్లిగవ్వకుండా ఇవ్వడం లేదన్నారు. కేసిఆర్‌తోనే బంగారు భరత్ సాధ్యమవుతుందని అన్నారు. జడ్పిటిసి పోలీస్ ధర్మారావు, నాయకులు, అంకతి నాగేశ్వర్‌రావు, పుండ్లు జైపాల్‌రెడ్డి, జులూరి లెనిన్ పాల్గొన్నారు.

# సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలి

### ఎంపిపి తక్కళ్లపల్లి స్వర్ణలత

పరకాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త




అధికారులు– స్థానిక ప్రజాప్రతినిదులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని పరకాల ఎంపిపి తక్కళ్లపెల్లి స్వర్ణలత సూచించారు. పరకాల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సాధాన సర్వసభ్య సమావేశం ఎంపిడివో ఇంద్రసేనారెడ్డి అద్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి స్వర్ణలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని, అభివృద్ధిలో సమన్యల పరిష్కారంతో ఎక్కడ సమన్వయ లోపం లేకుండా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధికారులు గ్రామాల్లోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ప్రజలు తమ సమస్యలను అధికారుల కంటే ఎక్కువగా ప్రజా ప్రతినిధులకే చెబుతారని, తప్పకుండా ప్రజాప్రతినిదుల సూచనలను పరిగణలోకి తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా మండల సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడివోకు సూచించారు. అదే



విధంగా గ్రామాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్తీక మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

పరకాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త



కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భవానీ కుంకుమేశ్వరస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశించారు. గురువారం హన్మకొండలోని ఆయన నివాసంలో ఆలయ చైర్మన్ మున్సిపల్ పాలకవర్గంతో కలిసి కార్తీక మహోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా మహోత్సవాలు ఘనంగా పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. కార్తీక మాసం ఎంతో పవిత్రమాసం అని అందువల్ల ఈ కార్యక్రమాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ కార్తీక మాసోత్సవం 30 రోజులను పురస్కరించుకొని దేవాలయం నందు భక్తులు రూ.1116 చెల్లించి రసీదు పొందిన కుటుంబ సభ్యుల గోత్రనామాలతో ప్రాత:కాలా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక మాసంలో సాయంత్రం 6గంటలకు ఆకాశదీపోత్సవంకు రూ.1116చెల్లించిన భక్తులకు కుటుంబ సభ్యుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ సదవకాశాన్ని భక్తులు సదినియోగం చేసుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోజు రాజు సుజాత, రావుల కొలను ప్రసాద్, కందుకూరి శ్రీధర్, ఏకు రఘుపతి, పరకాల పురపాలక సంఘం చైర్మన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, కౌన్సిలర్లు మడికొండ సంపత్‌కుమార్, ఒంటేరు సారయ్య, గోపి, దామెర మొగిళి, ఏకు రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మార్క రగుపతిగౌడ్, రమేష్, అనిల్, సదానందం, నవీన్ పాల్గొన్నారు.

## ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

పరకాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త



మాజీ అసెంబ్లీ స్పీకర్, ఎంఎల్సీ సిరికొండ మధుసూధనాచారి పుట్టిన రోజు వేడుకలు స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకునా న్రు. ఈ సందర్భంగా విశ్వకర్మ ట్రాస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అద్యక్షులు గుగ్గిల రాజు, కార్యదర్శి పొడిసెట్టి రాజు, సిరికొండ శ్రీనివాసచారి, తోటలింగచారి, వేణు, కోటేశ్వర్, పరామానందం, సదానందం, శ్రీధర్, తితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ స్వార్ధ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్

పర్వతగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త



కేవలం కేసిఆర్ స్వార్ధ్య ప్రయోజనాల కోసమే టిఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్పు చేశారని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కందికట్ల అనిల్ ,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము రమేష్ అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎందరో తెలంగాణా బిడ్డలు తెలంగాణా రాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేసుకుని ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని, కేసీఆర్ రాజకీయ స్వార్ధ ప్రయోజనాల కోసం టిఆర్ఎస్ పార్టీ పేరును బిఆర్ ఎస్‌గా ప్రకటించడం రాష్ట్రం కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న వారిని అవమానపరిచినట్టేనని, పేరుమార్పు ఆలోచనతో తెలంగాణా బిడ్డల ఆత్మగౌరవం మంటగలిసినట్టు కాదా! అని, కేసీఆర్ దొర పాలనలో తెలంగాణా రాష్ట్రం అభివృద్ధిని ఎంతగానో కోల్పోయిందని, ఆనాటి రజాకార్లు కేసీఆర్ కన్నా ఎంతో మిన్న అంటు తెలంగాణా వాదులు నేడు గగ్గోలు పెడుతున్నారన్నారు. తెలంగాణా రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉద్యమ సాధకులు, ఉద్యోగుల త్యాగాలు వున్నాయని,తెలంగాణాకు దళిత ముఖ్యమంత్రిని చేస్తానని యావత్ దళిత సమాజాన్ని మోసం చేసి అవమానించిన చరిత్ర హీనుడు కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బొక్కల ప్రమోద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విడుదల కృష్ణ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు భూక్య సురేందర్, లోకేష్, రంజిత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## నగదు బదిలీ పథకాన్ని రాష్ట్రమంతటా వర్తింప చేయాలి

రాయపర్తి, అక్టోబర్ 13, ప్రభాతవార్త



నగదుబదిలీ పథకాన్ని రాష్ట్ర మంతటా వర్తింప చేయాలని జీఎంపిఎస్ మండల అధ్యక్షుడు చందు మల్లేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మనుగోడు నియోజకవర్గంలో గొల్ల కురుమలకు గొర్రెల పంపిణికి బదులు నగదు బదిలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని జీఎంపీఎస్ మండలఅ ధ్యక్షుడు చందు మల్లేష్ యాదవ్ డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని జడ్పిటిసి రంగుకుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం గౌరవ అద్యక్షులు బందెల బాలరాజు, యాదవ సంఘం అధ్యక్షుడు బండి లింగయ్య, ప్రధాన కార్యదర్శి చందు లింగయ్య, జీఎంపీఎస్ సహాయ కార్యదర్శి చందు రాముయాదవ్, ఐనవోలు డైరెక్టర్ చిన్నాల ఉప్పలయ్య, ఫ్యాక్స్ డైరెక్టర్ కుంట రమేష్, మాజీ అద్యక్షుడు బక్కతట్ల సాయిలు, సంఘము సభ్యులు కసరబోయిన కుమార్, ఉడుత రాజు, కుంట మారయ్య, ఆవుల రమేష , జక్కుల కుమార్, కసరబోయిన రాజు, కే. లచ్చ, మల్లయ్య పాల్గొన్నారు.

# మునుగోడులో వరంగల్ హవా!

**చండూరులో పాలకుర్తి పవర్!!**
**ప్రచారంలో ముందుండి నడిపిస్తున్న**
**మంత్రి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**



ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ:
మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వావ నడుస్తోంది. చండూరులో పాలకుర్తి నియోజకవర్గ పవర్ పని చేస్తోంది. మునుగోడు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌లు ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు మునుగోడు ప్రచారం బాధ్యతలు అప్పగించారు. ఒక్కో నేతకు ఒక్కో ప్రాంతాన్ని, గ్రామాలను మున్సిపాలిటీ వార్డులను కేటాయించారు. 2 లేదా మూడు వేల ఓట్లకు ఒక ఇంచార్జీని నియమించారు. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కడియం, ఎమ్మెల్యేలకు, వరంగల్ మహానగర మేయర్ గుండు సుధారణి, పార్టీ నాయకులకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. వాళ్లంతా గత నాలుగైదు రోజులుగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో మకాం వేశారు. ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తున్నారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా వరంగల్ నేతలే కనిపిస్తున్నారు. మరోవైపు పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తనదైన శైలిలో ప్రచారం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయంగా మారరు. ప్రజల పనుల్లో మంత్రి భాగస్వాములు అయ్యారు. ఒకోక ఓటరుతో మాట్లాడుతూ వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీస్తున్నారు. డప్పు చప్పుళ్లతో స్థానిక నాకులతో కలిసి ఇంటింటికి వెళుతూ టిఆర్ఎస్, కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రజలను కలుస్తూ, వారి కష్ట సుఖాలను తెలుసుకుంటూ, వారితో మాట్లాడుతూ, ఫోటోలు దిగుతూ తిరిగి ఆ ఫోటోలను తన అనుచులతో ప్రజలకు పంపిస్తూ వస్తున్నారు. మంత్రికి అండగా, తోడుగా ఆయన ప్రానిధ్యం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గం నుండి వందలాదిగా పార్టీ ప్రజా ప్రతినిదులు, నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా చండూరుకు వెళుతూ, మంత్రి ఎర్రబెల్లితో పాటుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో ప్రచారానికి ఊపు వస్తున్నది. ప్రజల్లో కూడా మంచి చర్చ జరుగుతున్నది, పార్టీని పార్టీ అభ్యర్థిని, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ఇదే సమయంలో పలు చోట్ల ప్రజలతో ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో మంత్రి మాట్లాడుతున్నారు. ప్రజలకు ప్రస్తుతం ఎన్నికలు ఎందుకు వచ్చాయి. ఎవరి స్వార్థం కోసం వచ్చాయి? ప్రజల కర్తవ్యం ఏంటీ? అనే అంశాలను వారికి అర్థం చేస్తున్నారు. మంత్రి ఎర్రబెల్లితో పాటు స్థానిక ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాలకుర్తి నియోజకవర్గం నుండి ప్రచారం కోసం వెళ్లిన నేతలు తదితరులు పాల్గొన్నారు. మొత్తానికి మునుగోడులో వరంగల్, పాలకుర్తిల హవా నలు దిశలా వీస్తోంది.

# ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు తొలిమెట్టుపై దృష్టిపెట్టాలి

**జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు**



ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ:
ప్రాథమిక స్థాయి విద్యార్థుల సామార్యాలను పెంచే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖ అధికారులతో తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమములో విద్యార్థుల అభ్యాసన స్థాయిల స్థితిగతులను, ఉపాధ్యాయులు అవలంభిస్తున్న బోధన ప్ర క్రియలను ఆయన మండల విద్యాశాఖ అధికారులను ప్రశ్నించి తెలుసుకున్నారు. పాఠశాల విద్య కార్యదర్శి వాకటి కరుణ జూమ్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షా నిర్వహించి పలు సూచనలు చేశారు. తదుపరి జిల్లాలో ఈ నెల 15 నుండి 31 వరకు ఉపాద్యాయులు ప్రత్యేకంగా తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతి గది బోధనపైన శ్రద్ద చూపించాలని ఆయన తెలిపారు. ఈ నెల ఆఖరి వరకు మండల తొలిమెట్టు నోడల్ అధికారులు, క్లస్టర్ తొలిమెట్టు నోడల్ అధికారులు, విద్యార్థులను మదింపు చేయడం కాకుండా ఉపాధ్యాయుల హాజరు, ఉపాధ్యాయుల తరగతిగది బోధనలను పరిశీలించి తగు సూచనలు చేయడమే కాకుండా వ్యిర్థుల ప్రగతికి వారు ఏమి చేయాలో తెలియజేయాలన్నారు. తొలిమెట్టు కార్యక్రమం షెడ్యూల్ను క్రమంగా అమలు చేస్తూ ఈ విద్య సంవత్సరం ముగిసే వరకు ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లం, ఉర్దు, బాషా సబ్జెక్టులతో గణితము, సబ్జెక్టులో పూర్తి స్థాయిలో తరగతి వారి సామార్థ్యాలు కలిగి ఉండేటట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కమ్యూనిటి మొబిలైజేషన్ అధికారి, బి.రాద, ప్లానింగ్ కోఆర్డినేటర్ పి. శ్రీనివాస్, జెండర్ కోఆర్డినేటర్ జయ, మండల విద్యాశాఖ అధికారులు రామ్ కిషన్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, రమాదేవి పాల్గొన్నారు.

## మండలంలో పోడు భూముల సర్వే

శాయంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:



శాయంపేట మండలంలోని కాట్రపల్లి, నూర్జహాన్‌పల్లి, గంగినేని గూడెం, సాధనపల్లి, సూర్యానాయక్ తండా గ్రామాల శివారులో గురువారం పోడు భూములకు సంబంధించిన సర్వేను అధికారులు చేపట్టారు. జిల్లాపంచాయతీ అధికారి జగదీశ్వర్ మండల అధికారి అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా పోడు భూముల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడురైతులు సాగుచేస్తున్న భూముల వివరాలను ఫారెస్టు అధికారుల, రెవెన్యూ పంచాయతీ అధికారులు క్లుప్తంగా అడిగి తెలుసుకున్నామని అన్నారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ అర్హులైన పోడు రైతులకు పక్కాపత్రాలు వచ్చేలా అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఫారెస్ట్ అధికారులు, పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పోడు వ్యవసాయదారులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అందుబాటులో వెబ్‌సైట్ ఉండాలి

ఎడ్యుకేషన్ కేయూ, అక్టోబరు 13, ప్రభాతవార్త:



విద్యార్థికి అందుబాటులో వెబ్‌సైట్ ఉండాలని కేయూ వీసీ ఆచార్యతాటికొండ రమేష్, దూరవిద్య కేంద్ర వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. నూతన అంశాలతో విద్యార్థికేంద్రంగా, సరళమైన సులభమైన భాషలో అందరికి అందుబాటులో ఎప్పటికప్పుడు సమాచారం అందించే దిశగా వెబ్‌సైట్ ఉందని ఆచార్య రమేష్ అన్నారు. కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం సంచాలకులు ఆచార్యశ్రీనివాసరావు, సైకాలజీ విభాగ అధిపతి, జాయింట్ డైరెక్టర్ ఆచార్య వి.రామచంద్రం, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.కరుణాకర్, డీన్ ఆచార్య టి.శ్రీనివాసులు, ఎం.సదానందం, ఎస్.మల్లేశ్వర్, నల్లాని శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.




## కామన్ మెస్ రీఓపెన్ చేయాలి

ఎడ్యుకేషన్ కేయూ, అక్టోబరు 13, ప్రభాతవార్త:



ఏబీవీపీ కాకతీయ విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆఫీసులో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తేదీన రీ ఓపెన్ అని తెలియచేసిన యూనివర్శిటీ యాజమాన్యం ఇంతవరకు మెస్‌లు తెరవకపోవడం వల్ల దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తిండిదొరకక ఇబ్బందులు పడుతున్నారని, ఫీజు రియాంబర్స్‌మెంట్‌పై చదివే విద్యార్థులకు హాస్టల్ మెస్ కార్డు రెన్యువల్‌పేరుతో ఫీజుల దోపిడికి పాల్పడుతున్నారని, వెంటనే ఎలాంటి రుసుములు లేకుండా మెస్‌లు ఓపెన్‌చేసి విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. కచ్చితగా విద్యార్థులందరికి మెస్‌లో బయోమెట్రిక్ పెట్టి హాజరు నమోదు చేసి తిన్నవారికి మాత్రమే మెస్ బిల్లులు వేయాలన్నారు. యూనివర్శిటీ నాక్ పేరుతో హాస్టల్ మరమ్మతులకోసం మే 24నుంచి జూలై 4వరకు మెస్‌లు మేసివేసిందని, విద్యార్థులు ఎన్నిసార్లు ఆందోళన చేసినా కూడా విద్యార్థులపై కేసులుపెట్టారు కానీ మెస్‌ఓపెన్ చేయలేదన్నారు. కానీ ఈ సెలవుదిన్నాల్లోకూడా మెస్ బిల్లులుజూన్ మాసానికి కామన్‌మెస్, లేడీస్ హాస్టల్ లో రూ.800బిల్లులు వేశారని, ఈ మొత్తం కూడా 2500విద్యార్థులకు వేశారని వీటి విలువ సుమారు 20లక్షల రూపాయలన్నారు. ఈ 20లక్షల రూపాయలపై వెంటనే విచారణ ఆదేశించాలని రెండురోజుల్లో కమిటీవేసి వారం రోజులలో నివేదిక విడుదల చేయాలని కోరారు. వీటిపై రిజిస్ట్రార్ బదులిస్తూ రియంబర్స్‌మెంట్ పొందే విద్యార్థులకు ఉచితంగా మెస్‌కార్డులు రెన్యువల్ చేస్తామని రాని విద్యార్థులకు మెస్‌బిల్లులో 40శాతం కట్టాలన్నారు. జూన్‌నెలలో జరిగిన 20లక్షల బిల్లులు అవకతవకలపై విచారణకు ఆదేశించి వారం రోజులలో నివేదిక తెప్పించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ ఇన్‌చార్జి నిమ్మల రాజేష్,రాష్ట్ర నాయకులు పున్నం వేణు, సాయికుమార్, సాయి వెంకటేశ్, లక్ష్మణ్, మనోజ్, వినయ్, నరేష్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు

శాయంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:



మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం శాయంపేట మండలకేంద్రంలోని కూడలిలో తెలంగాణ తొలి శాసన సభాపతి ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు మండలకేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వంగాల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ మధుసూదనాచారి భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో వేడుకలు నిర్వహించామన్నారు. అలాగే నేరుడుపల్లిలో సిరికొండ యువసేన హన్మకొండ జిల్లా అధ్యక్షుడు బేరుగు రాకేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జనగం మంజుల సత్యనారాయణ, సంజీవరావు, మందరాజన్న, బలవంతుల కుమార్, గాజర్ల వంశీ, గుడిశాల సాయికుమార్, మాస్కూల్‌రాజు, ప్రశాంత్, విజయ్, ప్రవీణ్, కమలాకర్, సదయ్య, సుధీర్, మల్లయ్య, ఈజీ గిరి పాల్గొన్నారు.

# నర్సంపేట వార్త

## పారితోషికం ఉన్న పనులే ఆశా వర్కర్లతో చేయించాలి

### టిఆర్ఎస్‌కేబి జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

**నర్సంపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



ఆశా వర్కర్లతో పారితోషికం ఉన్న పనులే చేపించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ టిఆర్ఎస్‌కేవి అనుబంధ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ డీఎంహెచ్‌వో వెంకటనారాయణకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్‌కేవి జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామాలలో ఫీల్డ్ వర్క్ చేసిన తర్వాత సబ్ సెంటర్ డ్యూటీలు చేయాలని ఆశాలతో చూపిస్తున్నారని ఏఎన్‌సిలు నెలకు ఐదు చేయాలని టార్గెట్ పెడుతున్నారని గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి జనాభాకి 17, అర్బన్ ప్రాంతాలలో రెండు వేల జనాభాకు 32 కేసులు రిజిస్టర్ చేయాలని జాబ్ చార్ట్‌లో ఉన్న దానికి మించి చేయాలని ఒత్తి తీసుకురావడం సరికాదన్నారు. ప్రతి సబ్ సెంటర్లో ఆశలు చేసే పని జాబ్ చార్జ్‌ను డిస్ప్లే పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ జ్ఞాన సుందరి ఆశాల యూనియన్ రాష్ట్ర నాయకురాలు మైముద జిల్లా అధ్యక్షురాలు బోడ రజిత, జిల్లా కార్యదర్శి పిట్ట శ్రీలత, నాయకులు మంజుల, సుజాత, మమత, అనిత, మరియమ్మ, రజనీ, సుమిత్రా, లతా, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీసులో స్వచ్ఛభారత్

**నర్సంపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



ఇండియా పోస్ట్ సెలబ్రేషన్ నేషనల్ పోస్టల్ వీక్‌లో భాగంగా నర్సంపేట సబ్ పోస్ట్ ఆఫీస్‌లో స్వచ్ఛభారత్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట సడబ్ డివిజన్‌లోని సబ్‌పోస్టు మాస్టర్ బ్రాంచి పోస్టుమాస్టర్‌లు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పోస్టర్ ఇన్స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యాక్రమం ద్వారా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఐపీపీబీ ద్వారా ప్రజలందరికి లక్షల రూపాయలతో కూడిన బీమాను కేవలం 399 కే అందించడం జరుగుతుందని కావున ప్రజలందరు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బీమాకు సంబందించిన సరైన వివరాలు కోనం నర్సంపేట పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించి బీమాను చేయించుకోవాలని తెలిపారు.

## విధుల్లో చేరిన వీఆర్ఏలు

**దుగ్గొండి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



వీఆర్ఏలు గత 79 రోజు నుండి నిరవదిక సమ్మె చేస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించేవిధంగా చేస్తామనడంతో మండల కేంద్రంలో గురువారం స్థానిక తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు వీఆర్ఏలు తిరిగి బాధ్యతలు స్వీకరిస్తున్న పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లసారయ్య, పర్లపల్లి రవీందర్, మురళి, మద్దెల శ్రీనివాస్, సుద్దపల్లి రాజు, గై.నాగరాజు, పైడయ్య, శ్రీమాత, స్రవంతి, రమేష్, ఎల్లయ్య, శ్రీలత, దాసరి సారంగం పాల్గొన్నారు.

# కృష్ణ చైతన్య అందిస్తున్న సేవలను వెలకట్టలేము

## ఇంటి ప్రారంభోత్సవంలో జడ్పి ఫ్లోర్‌లీడర్ స్వప్న

**చెన్నారావుపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



టిఆర్ఎస్ మండల యువనాయకుడు కంది కృష్ణ చైతన్య నిరుపేదలు, ఆపదలో ఉన్న వారికి అందిస్తున్న సేవలు ఎప్పటికి వెలకట్టలేమని జడ్పిఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న అన్నారు. చెన్నారావుపేట గ్రామ పరిధిలోని కట్టయ్యపల్లిలో కనీసం ఉండేందుకు పూరిగుడిసె లేక మర్రి లక్ష్మీమల్లయ్య అనే వృద్ధ దంపతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి యొక్క ఇబ్బందులను గమణించిన కృష్ణచైతన్య వారికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. తన సొంత ఖర్చులతో రూపాయలు ఒక లక్ష 70వేలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టారు. అట్టి ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఇంటిని ప్రారంభించిన అనంతరం జడ్పిఫ్లోర్‌లీడర్ మాట్లాడుతూ కృష్ణచైతన్య ఎలాంటి స్వార్థ్యం లేకుండా తన సొంత ఖర్చులతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. గతంలో సైతం మరో ఇద్దరికి ఇంటి నిర్మాణాలు చేయించాడన్నారు. అంతేగాక కోవిడ్ సమయంలో పేదలకు అండగా నిలిచాడన్నారు. అంతేగాక ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ అందించే సేవలు మరొకరికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కాగా బాదిత



కుటుంబానికి తనవంతు ఒక క్వింటా బియ్యాన్ని అందిస్తామన్నారు. అలాగే విద్యుత్ సౌకర్యం కోసం తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామి ఇచ్చారు. కాగా పేద కుటుంబానికి సొంత ఖర్చులతో ఇంటి నిర్మాణం చేపట్టిన కృష్ణచైతన్యను స్థానికులు అభినందించగా వారి కుటుంబం బందువులు కృతజ్ఞతలు తెలిపి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బానోతు పత్తినాయక్, టిఆర్ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపిపి కంది కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ కుండె మల్లయ్య, జడ్పికోఆప్షన్ ఎండి రఫి, రైతుబంధు మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, జున్నుతుల రాంరెడ్డి, అమీనాబాద్ సొసైటి చైర్మన్ మురహరి రవి, మండల కోఆప్షన్ ఎం.ఎ గఫర్, గ్రామ పార్టీ అధ్యక్షులు కందకట్ల సాంబయ్య, మారెల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**నర్సంపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



ప్రమాధవశాత్తు పట్టణానికి చెందిన బాసాని నరేష్(సాయి) మృతిచెందగా మాజీ శాసన సభ్యులు రేవూరి ప్రకాష్‌రెడ్డి విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపి 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బిజెపి పార్టీ తరుపున పట్టణ అద్యక్షులు బాల్నె జగన్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెనెల్లి నర్సింహరాములు వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపెల్లి నర్సింహరాములు, పట్టణ అద్యక్షులు బాల్నె జగన్, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజు, మాజీ పట్టణ అద్యక్షులు కందగట్ల రాజు, శీలం సత్యనారాయణగౌడ్, చిలువేరు రమేష్, మడ్లపల్లి క్రాంతి, కోమాండ్ల సప్తగిరి, బిజెవైఎం ప్రధాన కార్యదర్శి బొడిగె ఈశ్వర్, ఠాగూర్, విజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువకుడి అదృశ్యం

**చెన్నారావుపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



ఓ గిరిజన యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని జోజిపేట నారాయణతండా గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఆంగోతు సురేష్ అనే యువకుడు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ నెల 8న ఆసుపత్రి కోసమని ఇంటి నుంచి వెళ్లాడన్నారు. సాయంత్రం ఇంటికి రాక ఎటు వెళ్లాడే తెలియదన్నారు. అతని కోసం పలు చోట్ల వెతికినా ఎలాంటి సమాచారం అందలేదన్నారు. దీంతో యువకుడి తల్లి భద్రమ్మ, గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా యువకుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యంపై విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ మహేందర్ ;పేర్కొన్నారు.

## విద్యార్థి బంగారు భవితకు తొలిమెట్టు

**నెక్కొండ, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

మండలంలోని చంద్రుగొండ కాంప్లెక్స్‌లో ప్రాథమిక పాటశాలలైన చంద్రుగొండ, గొల్లపల్లి, గేటుపల్లి, మూడుతండా, పాఠశాలలను మండల నోడల్ ఆఫీసర్ ఉండ్రాతి సుజన్‌తేజా తొలిమెట్టు కార్యక్రమాలను వాటి అభివృద్ధిని పర్యవేక్షించారు. వీరు తరగతి గది బోధనలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మీరు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు కచ్చితమైన పాఠ్యప్రణాళికను రూపొందించుకొని తగిన టీఎల్ఎం ఉపయోగిస్తూ కృత్యాధార బోధన చేపట్టాలని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తొలిమెట్టు ఎంతో ఉపయోగపడుతుందని వీరు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు రమేష్, దేవేందర్, శ్రీనివాసచారిలు పాల్గొన్నారు.

## ఉపాధిహామీతో పండ్ల తోటలను పెంపొందించుకోవాలి

### -ఏపిడి వసుమతి

**నల్లబెల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామి పథకంలో అందరు భాగస్వాములై పండ్ల తోటలను టేకు మొక్కలను పెంచుకునే అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ఉపాధిహామి జిల్లా అదనపు పీడీ వసుమతి సూచించారు. మండలంలోని శనిగరం గ్రామపంచాయతీ ఆవరణంలో గురువారం స్థానిక సర్పంచ్ డ్యాగల మల్లికాంబ అధ్యక్షతన ఉపాధిహామి ప్లానింగ్ ప్రాసెస్‌కు సంబందించిన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వసుమతి మాట్లాడుతూ గ్రామాలలో ఫామ్‌ఫండ్ చేపల చెరువులు అంతర్గత రోడ్లు మట్టి గట్టులు పండ్ల తోటలు టేకుమొక్కలు అను పనులను గ్రామస్తులు ఉపాధిహామి పథకం ద్వారా సద్వినియోగ పర్చుకొని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. అనంతరం ఆయా పనులపై గ్రామస్తులకు ఉపాధిహామి కూలీలకు చిన్న సన్నకారు రైతులకు అవగాహన కల్పించారు. ఉపాధిహామి పనులను 2023, 24 సంవత్సరంకు గాను ఈ పనులకు అవకాశం ఉందని దీని కోసం ఉపాధిహామి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య పాలకమండలి, సభ్యులు ప్రజలకు ఈ పనులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మథర్‌థెరిస్సా మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు ఊట్కూరి భాగ్యలక్ష్మి, ఉపాధిహామి ఈసి రాజు, టిఎ సాయికృష్ణ, పంచాయతీ సిబ్బంది, ఎఫ్ఎలు గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

## కూతురుని స్కామ్ నుంచి తప్పించేందుకే ఢిల్లీ పర్యటన

**చెన్నారావుపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

లిక్కర్‌స్కామ్ నుండి తన కూతురు కవితను తప్పించేందుకే ముఖ్యమంత్రి కేసిఆర్ ఢిల్లీ పర్యటన చేస్తున్నాడని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రం చెన్నారావుపేటలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముమ్మాటికి ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్‌లో సంబందం ఉందన్నారు. అంతేగాక వ్యక్తిగత స్వార్థ్యం పార్టీ ప్రయోజనం కోసమే ముఖ్యమంత్రి టిఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాడన్నారు. పార్టీ, కూతురుపై అభిమానం, ప్రేమ ప్రజలపై లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకొని అవినీతి టిఆర్ఎస్ పాలనకు చరమ గీతం పాడాలన్నారు.

# తెలంగాణ ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

## కాకతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



*ములుగు టౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

తెలంగాణ ఉద్యమకారుల ములుగు జిల్లా ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ప్రజా సంఘాల జాక్ చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ హాజరై మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణలో తెలంగాణ ప్రజల అస్తిత్వం దెబ్బతింటుందని, ప్రజలు కోరుకున్నది ప్రజాస్వామిక తెలంగాణ అని అన్నారు. మలిదశ పోరాటాలకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం సకల జనులు ఉద్యమం చేశారని, ఉద్యమంలో ఎంతో మంది అమరవీరులు అయ్యారని, తెలంగాణ కోసం నిత్య నిర్భందం, అక్రమ అరెస్టులు, కేసులు, జైలు జీవితాలు గడిపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ములుగు జిల్లా కమిటీ కన్వీనర్‌గా ముంజాల బిక్షపతి గౌడ్, కో కన్వీనర్‌గా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు చింత కృష్ణ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంతటి రమేష్ గౌడ్, సరోజన, జంపాల చంద్రశేఖర్, కర్నాటక సమ్మయ్య, తెలంగాణ ఉద్యమ రాష్ట్ర నాయకులు సోమ రామ్మూర్తి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు నలిగంటి చంద్రమౌళి, తెలంగాణ ఉద్యమకారుల జాక్ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జంపాల రవిందర్, నాయి బ్రహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్న మోహన్, సామ మోహన్ రెడ్డి, ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పోదెం కృష్ణ ప్రసాద్, చంద్రమౌళి, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు నక్క బిక్షపతి, బోడ రాములు, మానవ హక్కుల వేదిక ములుగు జిల్లా నాయకులు వనపాకల దిలీప్, సాంబయ్య, గుండెమీది వెంకటేశ్వర్లు, ఓరుగంటి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు ఆదర్శమూర్తి డాక్టర్ సీతక్క

## జర్నలిస్టుల ఆధ్వర్యంలో సన్మానం



*ములుగు టౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

ప్రజా ప్రతినిధిగా రాణిస్తూనే అటు విద్యకు, ఇటు రాజకీయ ప్రమాణాలకు పెద్దపీట వేసిన మార్గదర్శి, నిర్భయత్వానికి చెరగని చిరునామాగా నిలిచి, పట్టువదలని మడమ తిప్పని నేతగా ఉద్యమకారురాలుగా తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొంది ఉస్మానియా యూనివర్శిటీలో ఆదివాసీ గొత్తికోయలపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందిన సీతక్కను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన ఆటు పోట్లకు బాధపడకుండా...అటు రాజీపడకుండా గుర్తింపు పొందిన సీతక్క సమ్మక్క సారలమ్మ వన దేవతల పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని, పీడిత ప్రజల విముక్తి కోసం పోరుబాట పట్టిన సీతక్క అసెంబ్లీ సమావేశాల్లో తన గళాన్ని పేదల పక్షాన గర్జించిన తీరు తెలంగాణ ప్రజల హృదయాల్లో సీతక్క సజీవంగా నిలిచిదంటే ప్రజా సమస్యల పట్ల ఉన్న అవగాహనకు తార్కాణమనే సంకేతాలు ప్రజల్లో నెలకొనడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు చుంచు రవి, కుంచం రమేష్, తెలంగాణ ఉద్యమకారుడు, దివ్యాంగుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపకులు రాయబారపు రమేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దూడపాక రవిందర్, సంద బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

## డిఏఓ కే.ఏ.గౌస్ హైదర్

## ఆత్మ చైర్మన్ చంద చక్రపాణి




*ములుగు, అక్టోబర్ 13, ప్రభాతవార్త :*

ములుగు డివిజన్‌లోని ములుగు, వెంకటాపూర్ మండలాలలోని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) చైర్మన్, డైరెక్టర్లకు ములుగు ఏడిఏ కె. శ్రీపాల్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి కె.ఎ. గౌస్ హైదర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సెంట్రల్ గవర్నమెంట్ స్కీం అయినటువంటి ఆత్మ పథకాల గురించి వివరించారు. ఉద్యానవ శాఖ అధికారి కళ్యాణి కూరగాయల సాగు, పూల తోటల సాగు, ఆయిల్ ఫాంల సాగు గురించి తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి విజయ భాస్కర్ కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం వాటికి సంబంధించిన స్కీముల గురించి వివరించారు. మత్స్యశాఖ అధికారి శ్రీపతి చేపల పెంపకం గురించి తెలిపారు. ఆత్మ డైరెక్టర్లు వారి గ్రామాలలో అర్హులైన వ్యక్తులను గుర్తించి స్కీములకు ఎలిజిబిలిటి ఉన్నటువంటి వాళ్లకు సూచనలు, సలహాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. ఆత్మ చైర్మన్ చందా చక్రపాణి మాట్లాడుతూ నూకలు రానటువంటి నూతన వరి వంగడాలను పండించి వడ్లను సులువుగా అమ్ముకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆత్మ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ వేదికపైన జిల్లా వ్యవసాయాధికారి గౌస్ హైదర్‌కు, ఆత్మ చైర్మన్ చంద చక్రపాణి లను శాలువాతో సన్మానించారు.

# మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా కరుణాకర్

*వెంకటాపూర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :*

తెలంగాణ మోడల్ స్కూల్ జవహర్ నగర్ పాఠశాల నూతన ప్రిన్సిపాల్ గా తాబేటి కరుణాకర్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాడల్ స్కూల్ ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాప్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరిస్తానని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాఠశాలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని కరుణాకర్ తెలిపారు.



# ములుగు వార్త

## డాక్టర్ సీతక్కను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

*ములుగు టౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



ములుగు ఎమ్మెల్యే, పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా సీతక్కను ములుగు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకుతోట చంద్రమౌళి, ఎసీ సెల్ మండల అధ్యక్షులు మట్టెవాడ తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వాకిడి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండి అజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయురాలు డాక్టర్ సీతక్క

*ములుగు టౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



నిత్యం ప్రజాసేవలో తరించి పోతూనే అత్యున్నత డాక్టరేట్ పట్టా పొందిన డాక్టర్ సీతక్క అందరికీ ఆదర్శ ప్రాయురాలని సబ్ రిజిస్ట్రార్ తస్లీమా అన్నారు. ఉస్మా నియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా సాధించిన డాక్టర్ సీతక్కను గురువారం సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తస్లీమా మాట్లాడుతూ దట్టమైన అడవులలో నివసించే గిరిజన గొత్తికోయలకు అండగా ఉంటూ వారి యోగ క్షేమాలు సీతక్క చూసుకునే వారని అన్నారు. రాజనీతి శాస్త్రంలో కొండ కోనల్లో నివసించే గొత్తికోయ గిరిజనుల సామాజిక స్థితిగతులపై పరిశోధన చేసిన సీతక్కను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

## గుడయిబా స్దావరాలపై దాడులు

*వెంకటాపురం(నూగూరు),అక్టోబర్13,ప్రభాతవార్త:*

మండల పరిధిలోని రాచపల్లి,మల్లాపురం.కోయబెస్తాగూడెం గ్రామాల్లోని అటవీప్రాంతంలో ఉన్నా గుడుంబా స్దావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారంనాడు దాడులు నిర్వహించారు.ఈదాడుల్లో వంటకానికి సిద్దంగా ఉన్నా మూడువేల లీటర్ల బెల్లం పానకంని ద్వంసం చేశారు అలాగే నాలబై డ్రమ్ములని స్వాదీనం చేసుకున్నారు దాడులని పసి గట్టిన నిర్వహకులు అక్కడి నుండి జారుకున్నారు.గుడుంబా వండిన,అమ్మకాలు జరిపిన కఠినచర్యలు తీసుకుంటాం అని ఎక్సైజ్ సిఐ అశోక్ తెలిపారు ఈదాడుల్లో అయనతోపాటు సిబ్బంది పాల్గోన్నారు.



# ప్రాథమిక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తాం

## జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య



ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : ప్రాథమిక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందిస్తూ నాణ్యమైన విద్యపై పట్టుసాధిస్తామని జిల్లా కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషన్ లిటరసి న్యూమరేషన్‌పై రాష్ట్రస్థాయి అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించే కార్యక్రమాలను చేపడుతామని నాణ్యమైన విద్యపై పట్టుసాధిస్తామన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఆకర్షితమైన కార్యక్రమాలను చేపడుతామని తద్వారా ఉత్తమ ఫలితాలు రాబడుతామన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యను విద్యార్తులకు మరింత దగ్గరగా తీసుకొస్తామన్నారు. అనంతరం విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ మాట్లాడుతూ అక్టోబరు 31లోపు (నేటి నుంచి రాబోయే 15రోజులు) తొలిమెట్టు కార్యక్రమంలో కీలక రోజులుగా పరిగణించాలన్నారు. ఈ పదిహేను రోజులలో ప్రతీ తరగతి గదిలో బోధనా పద్ధతిలో మార్పు రావాలన్నారు. తగిన పాఠ్యబోధన సోపానాలు వినియోగించుకుంటూ పీరియడ్ ప్లాన్‌ను అమలు చేయడం, అవసరమైన టీఎల్ఎంతో బోధనా ధ్యానన ప్రక్రియ కొనసాగడం, పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా వినియోగించడంపై మూడు అంశాలు ప్రతీ ఉపాధ్యాయులకు చేరాలన్నారు. ఈ 15రోజుల సమయంలో ప్రతీ రాష్ట్ర, జిల్లా, మండల, కాంప్లెక్స్ స్థాయి అధికారులు పై అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. మండల, కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్లు పాఠశాల సందర్శన సందర్భంలో అసెస్మెంట్ కంటే పై మూడు అంశాలపై ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, విద్యాశాఖ అధికారి కె.రాము, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచాలి

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కె. శశాంక



**బయ్యారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి పరుస్తూ మౌళిక వసతులను కల్పించడం జరుగుతుందని, దానికనుగుణంగా నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. శశాంక అన్నారు. గురువారం మండలంలోని సంతులాల్‌పోడు తండ, కాంచనపల్లి, కొత్తగూడెం ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మన ఊరు, మన బడిలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎర్రయ్య, అధికారులు హేమలత, తహశీల్దారు రమేష్, ఎంపీడీవో చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ ప్రైవేట్ ఆసుపత్రిపై వైద్యాధికారులు చర్యలు తీసుకుంటారా.. ?

## నకిలీ వైద్యులతో వైద్య సేవలు

## జిల్లా వైద్యాధికారుల తనిఖీలో తేలిన బాగోతం



**తొర్రూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** కొంతమంది వ్యక్తులు ఆర్థిక ంగా ఉండడంతో కొంతమంది వైద్యులను నియమించుకొని ఎలాంటి అర్హత లేకున్నప్పటికీ వారినే వైద్యులుగా చూపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వైద్యం పేరుతో సామాన్య ప్రజల నుండి అధిక మొత్తంలో ఫీజుల రూపంలో వసూలు చేస్తూ మూడు పువ్వులు ఆరు కాయలులాగా వైద్యాన్ని వ్యాపారంగా కొనసాగిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో అనేక ప్రాంతాలలో ఇలాంటి అర్హత లేని ఆసుపత్రులతో పాటు వైద్యులు కూడా ఉన్నారు. ఇలాంటి సంఘటనే తొర్రూరు డివిజన్ కేంద్రంలో గురువారం జిల్లా వైద్యాధికారుల బృందం శ్రీసాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని తనిఖీ చేయగా నకిలీ వైద్యులతో వైద్యం చేస్తున్నట్లు వైద్యానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆసుపత్రిని నడిపే యజమానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే ఇక్కడ అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే వైద్యాధికారులు స్వయంగా ఈ ప్రైవేట్ ఆసుపత్రిలో నకిలీ వైద్యులతో వైద్యం చేయిస్తున్నారని తేలినప్పటికీ చర్యలు తీసుకుంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణమేమిటంటే ఇంతకాలం యథేచ్ఛగా ఎలాంటి అర్హత లేకుండా ప్రైవేట్ ఆసుపత్రితో పాటు నకిలీ వైద్యులతో ఆసుపత్రిని నడుపుతున్నారంటే అలాంటి వ్యక్తుల వెనుక ఆర్థిక బలంతో పాటు రాజకీయ అండదండలు ఉంటేనే ఇంత సాహసం చేస్తారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇలాంటి నకిలీ వైద్యంతో వ్యాపారం చేసే వ్యక్తులపై వైద్య శాఖ శాఖాపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఇలాంటి నకిలీ వైద్యులను వెలికితీసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు. అనంతరం ఈ సంఘటనపై జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్ మాట్లాడుతూ ఆసుపత్రికి సంబంధించిన అనుమతి పత్రాలు 24 గంటల లోపు సమర్పించాలని వైద్యులను ఆదేశించారు. అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్‌లు నడిపితే వాటిని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో జిల్లా ఉపవైద్యాధికారులు గుండాల మురళీధర్, అంబరీష, ఉమాగౌరి, ప్రోగ్రాం అధికారి బిందు శ్రీ, అధికారులు కెవి రాజు, రుద్రపతి, విజయ్ కుమార్, పనాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర విభాగంలో తూము విజయ్‌కుమార్‌కు డాక్టరేట్

**ఎడ్యుకేషన్ కేయూ, అక్టోబరు 13, ప్రభాతవార్త:**



కేయూ చరిత్ర విభాగంలో తూము విజయ్‌కుమార్‌కు డాక్టరేట్‌ను పేయిర్స్ అండ్ ఫెస్టివల్స్ ఆఫ్ ట్రైబల్స్ ఇన్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్-ఏ స్టడీ అనే అంశానికి కాకతీయ యూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి.మల్లారెడ్డి డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ విజయ్‌కుమార్ విభాగ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పి.సదానందం పర్యవేక్షణలో పూర్తిచేశారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఆకోలి గ్రామానికి చెందిన డాక్టర్ తూము విజయ్‌కుమార్‌ను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# విద్యాశాఖామంత్రిని కలిసిన గ్రంథాలయ చైర్మన్



**భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సబిత ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ మర్యాద పూర్వకంగా కలిసారు. భూపాలపల్లి ఎంఎల్ఏ గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో నూతన గ్రంథాలయ భవనం కోసం నిధులను విడుదల చేయాలని, జిల్లా , గ్రామ గ్రంథాలయాల కోసం రీడింగ్ చైర్స్, టేబుల్స్, బుక్స్‌రాక్స్‌ల కోసం రూ. 50 లక్షలను విడుదల చేయాలని కోరారు.

జిల్లాలోని తాడిచర్ల, గణపురం, చల్లగరిగే, చెల్పూర్, చిన్నకోడేపాకలలో భవనాల నిర్మాణం కోసం నిధులను విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

# అజ్ఞాత మావోయిస్టులు లొంగిపోతే కేసులు ఎత్తివేస్తాం

## లొంగుబాటుకు కుటుంబ సభ్యులు సహకరించాలి

## జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డి



**భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

అజ్ఞాత మావోయిస్టులు లొంగిపోతే వారిపై ఉన్న కేసులను ఎత్తివేస్తామని, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు ఉపాధి, ప్రశాంత జీవితానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ జె సురేందర్‌రెడ్డి అన్నారు. గురువార ం భూపాలపల్లి పట్టణంలోని సుభాన్‌కాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో అజ్ఞాత మావోయిస్టుల కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ సురేందర్‌రెడ్డి జిల్లాలో ఏడుగురు మావోయిస్టులు ఉండగా వారి కుటుంబ సభ్యులతో కలసి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మావోల కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్యలు ఎదురయినా అవసరమైన వైద్య చికిత్సలు అందించడానికి జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉన్నారు. మావోయిస్టులు వారి కుటుంబ సభ్యుల కోసమైన అడవి బాటను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. అజ్ఞాత జీవనం గడుపుతున్న మావోలు అనేక ఆరోగ్య సంబంధమైన ఇబ్బందులు పడుతున్నారని, జనజీవన స్రవంతిలో కలిస్తే వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తామని ప్రకటించారు. వనం వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని, కాలం చెల్లిన సిద్ధాంతాలతో సాధించేది ఏమి ఉండదని అన్నారు. అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లకు కుటుంబ సభ్యులు నచ్చజెప్పి లొంగిపోయేలా కృషి చేయాలని కోరారు. వారిపై ఉన్న కేసులను ఎత్తివేయటంతో పాటు రివార్డులను కూడా అందజేస్తామని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి గౌస్ అలం, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు రాములు, రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గెం వెంకటరాణి, డాక్టర్ కిరణ్, ఇన్స్‌పెక్టర్లు జానీ నర్సింహులు, సిహెచ్ రాజిరెడ్డి, పులి వెంకట్, రంజిత్‌రావు, అజయ్ పాల్గొన్నారు. అంతకుముందు మావోయిస్టుల కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు, దుస్తులు అందజేశారు.

# వాణిజ్యపరమైన నిర్మాణాల గుర్తింపు సర్వే పటిష్టంగా నిర్వహించండి

**-జీడబ్ల్యూఎంసీ కమీషనర్ పి. ప్రావీణ్య**

**-పైలెట్ ప్రాజెక్టుగా మెదటి విడతలో వరంగల్‌లో 2 స్ట్రేచెస్ హన్మకొండలో 2 సర్వే**

**-టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, అధికారులు సిబ్బందితో ప్రత్యేక బృందాలుపర్పాటు**



*ప్రభాతవార్త, పోచమ్మమైదానం, అక్టోబర్ 13*

వాణిజ్య ఉపయోగం నిర్మాణాల గుర్తింపు సర్వే పటిష్టంగా నిర్వహించి సకాలంలో నివేదిక సమర్పించాలని గ్రేటర్ వరంగల్ మహానగరపాలక కమీషనర్ పీ.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సర్వే బృందాలతో జరిగిన సమావేశంలో వాణిజ్య ఉపయోగ నిర్మాణాల గుర్తింపు సర్వే పక్కాగా నిర్వహించుటకు కమీషనర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వాణిజ్య ఉపయోగనిర్మాణాల గుర్తింపు సర్వే ముఖ్య ఉద్దేశం వాణిజ్య, నివాస వినియోగాల రికార్డ్ నిర్వహణ కార్పోరేషన్ ఆదాయం పెంచడం, క్రమబద్ధీకరించడమేనని ఆమె అన్నారు. పైలట్ ప్రాజెక్ట్‌గా మొదటి విడతలో హన్మకొండలో 2 వరంగల్‌లో 2 వాణిజ్య ప్రాంతాలను స్ట్రేచెస్‌ల సర్వే నిర్వహిస్తున్నట్లు హన్మకొండలోని కాళోజీ జంక్షన్ నుంచి పోలీస్ కమీషనర్ కార్యాలయం వరకు, పోలీస్ కమీషనరేటర్ నుంచి ములుగు రోడ్డు జంక్షన్ వరకు అదేవిధంగా ములుగు రోడ్డు జంక్షన్ నుంచి పోచమ్మమైదానం జంక్షన్ వరకు, పోచమ్మ మైదానం జంక్షన్ నుంచి వెంకటరమణ టాకీస్ జంక్షన్ వరకు ఇరువైపులా వాణిజ్య నివాస వినియోగ వివరాలు నిర్దేశించిన నమూనాలో సేకరించాలన్నారు. ఈ సర్వే వారం రోజుల్లో పూర్తయ్యేలా పర్యవేక్షణ అధికారులుపర్యవేక్షించి రోజువారి నివేదించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి జీడబ్ల్యూఎంసీలో ఉన్న వివరాల ప్రకారం పరిశీలించాలని, లేనిచో యజమానిని అనుమతి వివరాలు అడగాలని నివాసం కొరకు అనుమతి తీసుకొని కమర్షియల్‌గా వినియోగం, నిర్మించిన అదనపు అంతస్థులను సెల్లార్లలో నిర్మాణాలు, అనధికారక పెంట్ హౌజ్ నిర్మానాలు, డీవియేషన్‌లను గుర్తించాలన్నారు. కమర్షియల్‌గా ఉపయోగించే భవనాల ట్రేడ్ లైసెన్స్ ఉన్నచో విస్తీర్ణం కొలతలు తీసుకోవాలని, తాజా భువన్ జియో టాగింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమీషనర్ రషీద్ డిప్యూటీ కమీషనర్‌లు జి. శ్రీనివాస్‌రెడ్డి, జోనా డీసీపీ ప్రకాష్ రెడ్డి,ఐటీ మేనేజర్ రమేష్, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సానిటరీ సూపర్వైజర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.




## నేడు నీటి సరఫరా బంద్

**-పెరుకవాడలో కొనసాగుతున్న ఇంటర్ కనెక్షన్ పనులు**

*పోచమ్మమైదానం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

బల్దియా పరిధి వరంగల్ ప్రాంతంలోని పెరుకవాడలో నీటి సరఫరాకు సంబంధించిన ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున నేడు పెరుకవాడ, శివానగర్ ఫోర్ట్ వరంగల్, పుప్పాల గుట్ట, ఏకశిలా నగర్, ప్రాంతాలతో పాటు హంటర్ రోడ్డు వైపు ప్రాంతమైన సంతోషిమాత ట్యాంక్ ఏరియాలలో నేడు నీటి సరఫరా ఉండదని, కావున ప్రజలుసహకరించాలని బల్దియా ఈఈ రాజయ్యఒ ప్రకటనలో తెలిపారు.

## ప్రపంచ ఆహార దినోత్సవం కార్యక్రమం

*నడికూడ,ప్రభాతవార్త:*

నడికూడ మండలంలోని జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆహార దినోత్సవం కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సత్యనారాయణ డిటిసిఎస్ రెవెన్యూ అధికారి హేమానాయక్ ఆర్ఐ పాల్గొన్నారు. ఇందులో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు నోట్‌బుక్‌లు పెన్నులు ఇవ్వడం జరిగింది.ఇందులో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రెషన్ డీలర్ అద్యక్షుడు సర్వేశం, ప్రదానోపాద్యాయుడు పట్టాభి, ఉపాద్యాయులు పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహేందర్ డీలర్లకు ఆహార భద్రత గూర్చి తెలియజేశారు. మండల రెషన్ డీలర్లు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు బానిస కావద్దు

**-ఎస్సై పరమేష్**

*ఎల్కతుర్తి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

మండలకేంద్రంలో జడ్పీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఎస్ఐజే పరమేష్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై పాఠశాల అవగాహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదవాలని తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాలను చట్టం నిషేధించిందని వాటిపట్ల దూరంగా ఉండాలని ఈ ఎస్సై జే. పరమేష్ ఈ సందర్భంగా అన్నారు. ఫోన్‌లో వచ్చే ఆన్‌లైన్ సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని ఎవ్వరైనా రోడ్డుమీద బైక్ పై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. పోలీస్ సహాయం కోసం 100కు డయల్ చేయవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నాగుర్లకు పెరుగుతున్న మద్దతు

**మండల కేంద్రంలో ఆరె కుల సంఘం సమావేశం**

**నాగుర్ల నాయకత్వంలోనే పని చేస్తామని ఏకగ్రీవ తీర్మాణం**

*నడికూడ,ప్రభాతవార్త:*



నడికూడ మండల కేంద్రంలో ఆరెకుల సంఘం ఆద్వర్యంలో గ్రామ కమిటి అద్యక్షుడు హెండిగ వెంకటేశ్వర్లు అద్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి మండల అద్యక్షుడు లోకటి నగేష్ సీనియర్ నాయకులు వాంకె రాజయ్య హాజరయ్యారు.ఇందులో భాగంగా నడికూడ గ్రామం ఆరెకులస్తులందరూ రాష్ట్ర గౌరవ అద్యక్షులు నాగుర్ల వెంకన్న రాష్ట్ర అద్యక్షులు చెట్టుపల్లి శివాజి నాయకత్వంలోనే పని చేస్తామని నడికూడ గ్రామ ఆరెకులస్తులు అందరూ ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు.వారు మాట్లాడుతూ మచ్చ లేని నాయకుడు ఉద్యమనాయకుడు నాగుర్ల వెంకన ్న అని అలాంటి నాయకున్ని స్తాయి లేని వారు విమర్శించడం హాస్యాస్పదం అన్నారు.ఆరె కులానికి బిసిఓ సర్టిఫికెట్ రావడంలో కృషి చేసిన ప్రముఖ నాయకులలో ఒకరు చెట్టుపల్లి శివాజి అన్నారు.నాగుర్ల అండ లేకుండా రాజకీయ భవిష్యత్ లేని కొందరు ఆయనను విమర్శించడాన్ని ఖండిస్తున్నామన్నారు.ఆరే కుల రాష్ట్ర అద్యక్షులు రాష్ట్ర కమిటి తీసుకున్న నిర్ణయానికి ఆమోదిస్తున్నామని ఎల్లపుడు నాగుర్ల వెన్న చెట్లుపల్లి శివాజి నాయకత్వంలోనే పని చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నడికూడ ఆరెకుల సభ్యులు కుడ్ల రవి,వాంకె రాజు,తోర్నె అనిల్,కుడ్ల కిషన్,కుడ్ల యుగేందర్,ఇరువాల క్రిష ్ణకాంత్,లోకటి శ్రీను,కొల్లూరి సాంబశివరావు,కుడ్ల నారాయణ,కుడ్ల తిరుమల్‌రావు, పుస్కూరి శంకర్‌రావు,మోకిడి రాజు, రాము, ప్రసాద్, శంకర్, రాజయ్య, శ్రీకాంత్, రాజేశ్వర్‌రావు,లక్ష్మణ్,శ్రీను, పాల్గొన్నారు.

## మునుగోడు ఎన్నికల ప్రచారంలో ఎల్కతుర్తి బీఆర్ఎస్ నాయకులు

*ఎల్కతుర్తి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

మండలంలోని గ్రామశాఖ అధ్యక్షులు ఉపాధ్యక్షులు సర్పంచ్‌లు ఎంపీటీసీలు రైల్వే బోర్డు మెంబరు మాజీ ఎంపీటీసీలు టీఆర్ఎస్ నాయకులు మొదలగు వారు నల్గొండ జిల్లా మునుగోడులో బై ఎలక్షన్ల కోసం ఎన్నికల ప్రచారానికి వెళ్లిన టీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా వారు ప్రచారంలో పాల్గొని టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం స్థానిక మండల నాయకులు వెళ్లి యుద్ధ ప్రాతిపథికన ప్రతి ఓటర్‌ను టచ్‌చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో రైల్వే బోర్డు మెంబర్ యేల్తూరి స్వామి, మాజీ ఎంపీటీసీ పిట్టల మహేందర్, మండల ఆరే సంఘం అధ్యక్షులు కుడితాడి రాజు దాదాపు 20 మంది బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.



## మృతురాలు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన బిజెపి నేత మాచర్ల

*భీమదేవరపల్లి,అక్టోబరు13,ప్రభాతవార్త*

భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఇటీవల పోలు సాంబరాజు భార్య జ్యోతి గుండెపోటుతో మరణించడంతో మృతురాలు కుటుంబానికి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మాచర్ల కుమారస్వామి పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు.మృతురాలు జ్యోతికి ముగ్గురు కూతుళ్ళు కాగా వారిని జ్యోతి భర్తను కుమారస్వామి ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సుధాకర్, రవిందర్, ఐలయ్య, బిక్షపతి, శ్యామ్,సతీష్, నాగరాజు, శ్రీనివాస్, సురేష్ తదితరులున్నారు.

## ఎంపీ వద్దిరాజు ఆధ్వర్యంలో చండూరుకు తరళివచ్చిన మున్నూరుకాపులు

**-బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన ర్యాలీ**

**- సభలో పాల్గొన్న జిల్లా మంత్రి దయాకర్ రావు**

*ప్రభాతవార్త, పోచమ్మమైదాన్, అక్టోబర్ 13*



మునుగోడులో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సర్దార్ పుట్టం పురుషోత్తం నాకత్వాన మున్నూరుకాపులు చండూరుకు పెద్ద సంఖ్యలో తరళిచ్చారు. మునుగోడు నియోజకవర్గంలో గ్రామగ్రామాన ఉన్న మున్నూరుకాపులు ఆకుపచ్చని, గులాబీ కండువాలుమెడలో ధరించి మండుటెండలో మోటార్ సైకిళ్లపై తరళివచ్చారు. టీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కేటీరామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు, సభకు వేలాది మంది తరళివచ్చి దిగ్విజయం చేశారు. మంత్రి కేటీఆర్ 45 నిమిషాలకు పైగా చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి అనూహ్యస్పందన రాగా చండూరుకు తరళివచ్చిన మున్నూరుకాపు ప్రముఖులలో ఆకుల రంజిత్, వాసుదేవుల వెంకట నర్సయ్య, సకినాల రవికుమార్, జెన్నాయి కోడే జగన్, సోమ నారాయణ, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటిన ఆదర్శయువ మండలి సభ్యులు




**దేవరుప్పుల, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దమడూరు గ్రామానికిచెందిన జోగుమధు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మధుకు ఇద్దరు కవల ఆడపిల్లలు ఉండగా తండ్రి మరణంతో వారు అనాథలుకాగా వారి ఎదుగుదలకు, చదువుల కోసం పెద్దమడూరు ఆదర్శ యువమండలి ఆదర్శంగా నిలిచి ఆర్థికంగా వారిని ఆదుకున్నారు. ఈసందర్భంగా మండలి సభ్యులు గ్రామ ప్రజల సహకారంతో రూ.2,71,632లను జోగు మధు దశదిన కార్యక్రమంలో మధు తల్లి జోగు అనసూయకు అందించి మానవత్వం చాటుకున్నారు. కాగా, జోగు మధు కోరుకున్న ఆశయాలను తాము నెరవేర్చుతామని తోటిమిత్రులు తెలిపారు. ఆర్థికంగా సహకరించిన అందరికి మధు తల్లి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈసందర్భంగా గ్రామప్రజలు, ప్రజాప్రతినిధులు ఆదర్శయువ మండలిని అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శ యువ మండలి గ్రూప్ సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

# మునుగోడులో తెరాస అభ్యర్థిదే గెలుపు



**లింగాలఘణపురం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపు ఖాయమని తెరాస లింగాలఘణపురం మండల అధ్యక్షులు బస్వగాని శ్రీనివాస్ గురువారం మండలపార్టీ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గంలోని ఇందుర్తి గ్రామం నుంచి నామినేషన్‌కు మద్దతుగా అక్కడ ప్రచారం చేశారు. ఈసందర్భంగా ప్రచారంలో లింగాలఘణపురం మండలనాయకులు ఇంటింటికి వెళ్లి తెరాస అభ్యర్థి గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ వర్ ్క్స చైర్మన్ బొల్లంపల్లి నాగేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్‌దక్కదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజలు టీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. కార్యక్రమంలో లింగాలఘణపురం మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్,గంగసాని రంజిత్‌రెడ్డి, అంతగల్ల రాంచందర్, శ్రీహరి, గాదెపాక విష్ణు దాసరి స్వామి, ధోని తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 పరీక్షాకేంద్రంలో ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్



**జనగామ టౌన్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌లో ఉన్న ఏకశిల హైస్కూల్‌లో ఏర్పాటు చేసినగ్రూప్ వన్ పరీక్షా కేంద్ర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య గురువారం సందర్శించి పర్యవేక్షించారు. బార్కోడింగ్ పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ డెస్క్ బయోమెట్రిక్ వేగవంతంగా చేపట్టేందుకు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బార్కోడింగ్ పరీక్ష రాసే అభ్యర్థులకు అనుకూలంగా ఉండాలని, రిజిస్ట్రేషన్ డెస్క్ బయోమెట్రిక్ వెంట వెంటనే జరిగే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. అనంతరం పరీక్షా కేంద్రంలో సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. కలెక్టరు వెంట అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, డీఆర్‌డీఓ జి.రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రజిత, మున్సిపల్ డీఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మోడల్‌స్కూల్‌లో కెమిస్ట్రి విద్యాబోధనకై దరఖాస్తుల ఆహ్వానం

**రఘునాథపల్లి, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రఘునాథపల్లి మండలంలోని వెల్దిగ్రామ శివారులోగల తెలంగాణ మోడల్‌స్కూల్ (జూనియర్ కాలేజీ) తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు కెమిస్ట్రీ సబ్జెక్ట్ ఆంగ్ల మాధ్యమంలో తాత్కాలిక ప్రాతిపదికన బోధించుటకు ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) బీఈడీ చదివిన వారు ఈనెల 15లోగా నేరుగా మోడల్‌స్కూల్‌లో తమ దరఖాస్తులను అందచేయాలని ప్రిన్సిపాల్ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# పోడు భూముల సర్వే పక్కాగా చేపట్టాలి

- అధికారులు సమన్వయంతో సర్వే పనులు పూర్తి చేయాలి
- పారదర్శకతతో పాటు అడువులను కాపాడాలి
- కోనరావుపేటలో సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్



**కోనరావుపేట,ప్రభాతవార్త:** పోడు భూముల సర్వే పారదర్శకతతో పాటుగా పక్కాగా చేపట్టాలనీ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం కోనరావుపేట మండలం భూక్యారెడ్డి తండా గ్రామంలో జరుగుతున్న పోడు భూముల సర్వే పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలోన సర్వే పనులు ఏ విధంగా జరుగుతున్నాని అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అను గుణంగా సర్వే పనులు చేపట్టాలనీ, పోడు చేస్తున్న భూమిని కాకుండా కొత్తగా అటవీ భూమి అక్రమణ చేసిన వాటిని సర్వే చేపట్ట వద్దన్నారు. అర్హులకు న్యాయం జరగాలనే ప్రభుత్వ లక్ష్యం ప్రకారం రెవెన్యూ,ఫారెస్ట్, వ్యవసాయశాఖ ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పోడు భూముల పై హక్కుల ప్రాథమిక నివేధికను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 66 గ్రామాలకు నుంచి 14 వేల 31 ఎకరాల భూముల పై హక్కులు కల్పించాలని, 5 వేల 940 ఫిర్యాదులు అందయాని అన్నారు. వీటిని ఆధారంగా చేసుకోని అధికార బృందాలు క్షేత్రస్థాయిలో సర్వే పనులు చేపడుతున్నారని అన్నారు. అటవీ సంపదను సంరక్షిస్తూనే, అర్హులైనా వారికి అటవీ హక్కుల కల్పనకు అధి కారులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట అదనపు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

జనగామ వార్త



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**పాలకుర్తి, అక్టోబరు 13, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని భారతీయ జనతాపార్టీ పట్టణ అధ్యక్షుడు దుంపల సంపత్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యం అభివృద్ధిలో భాగంగా కోట్ల రూపాయల నిధులతో శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ముఖద్వారం దగ్గర గ్రామంలో చేపడుతున్న సైడ్ డ్రైనేజీ కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. కాలనీ ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి దేవస్థానం వద్దకు దర్శనంకోసం వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు డీఈ ఏఈల దృష్టికి తీసుకపోయినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు పెనుగొండ సోమేశ్వర్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సోమయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్

**జనగామ టౌన్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** జనగామ జిల్లాస్థాయి అథ్లెటిక్ సెలక్షన్స్ ఈనెల 18 మంగళవారం రోజు స్థానిక మినీస్టేడియం ధర్మకంచలో జరుగుతాయని జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది వెంకటనారాయణగౌడ్, కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన వారు ఈనెల 22,23వ తేదీలలో హన్మకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగే ఎనిమిదవ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 18న ఉదయం 9గంటలకు స్థానిక ధర్మకంచలోని మినీస్టేడియంకు జనన ధ్రువీకరణపత్రం లేదా పదవ తరగతి మెమో తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అండర్14సంవత్సరాల బాలబాలికలు 2008,నవంబరు 16 నుంచి 2010, నవంబరు 15మధ్య జన్మించి ఉండాలని, అండర్ 16బాలబాలికలు 2006, నవంబరు 16నుంచి 2010,నవంబరు 15 మధ్య జన్మించి ఉండాలని, అండర్ 18సంవత్సరాల బాలబాలికలు 2002, నవంబరు 16నుంచి 2004,నవంబరు 15 మధ్య జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులకు పోటీలు 14సంవత్సరాలలోపు బాలబాలికలకు 60మీటర్లు, 600మీటర్లు పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ త్రోలలో పోటీలు ఉంటాయని, 16సంవత్సరాల విభాగంలోని బాలబాలికలకు 100మీటర్స్, 300మీటర్స్, 800మీటర్స్, 2000మీటర్స్ పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌త్రో, డిస్కస్ త్రోలలో పోటీలు ఉంటాయని తెలిపారు. 18సంవత్సరాల విభాగంలోని బాలబాలికలకు 100మీటర్స్, 200మీటర్స్, 400మీటర్స్, 800మీటర్స్, 1500మీటర్స్, 3వేల మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌త్రో, డిస్కస్‌త్రోలలో పోటీలు ఉండునని, 20సంవత్సరాల లోపు బాలబాలికలకు 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు,800మీటర్లు,1500మీటర్లు, 5వేల మీటర్ల, పదివేల మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌త్రో, డిస్కస్‌త్రో లలో పోటీలు ఉండునని తెలిపారు. మరిన్ని వివరాలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్‌సెక్రటరీ వంచ చంద్రశేఖర్‌రెడ్డి సెల్‌నెం.7799552233 సంప్రదించాలన్నారు.

# బ్యాంక్ లావాదేవిలపై విద్యార్థులకు అవగాహన

**వీణవంక, ప్రభాత వార్త:** వీణవంక మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ దేవేందర్ బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మేనేజర్ క్రెడిట్, డెబిట్‌తో పాటు ఏటిఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ సైన్స్ టీచర్ ముల్కల కుమార్ మాట్లాడుతూ... క్షేత్ర పర్యటన వల్ల పరిశీలన, పరిశోధనాత్మక దృక్పథం పెంపొందిస్తున్నారని, సాధారణ తరగతి బోధనకు భిన్నంగా ప్రత్యక్షంగా పరిసరాలు, యంత్రాలతో పరిచయం వల్ల విద్యార్థుల వివరణాత్మక, విమర్శనాత్మక, విశ్లేషణత్మక దృక్పథం పెరిగి ఎక్కువ కాలం గుర్తుండే విధంగా దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు వేణు, జయపాల్ రెడ్డి, శ్రీనివాస్‌తో పాటు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితం

**-సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి**

**-భూపాలపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోష్ణ**

**-సర్వీసును కన్నాయిగూడెంకు పొడగించండి**

**-పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత-తిరుపతి**

పలిమెల, అక్టోబర్ 13, ప్రభాతవార్త

ప్రజలందరూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి, సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించాలని భూపాలపల్లి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోష్ణ అన్నారు. ప్రజల వద్దకు ఆర్టీసీలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలకేంద్రానికి వచ్చిన భూపాలపల్లి



ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోష్న మాట్లాడారు. అదేవిధంగా ముకునూరు నుండి డైలీ నడిచే సర్వీసును కన్నాయిగూడెం వరకు పొడిగించాలని పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత-తిరుపతి వినతి పత్రాన్ని సమర్పించారు. తక్కువ ఖర్చులో ప్రయాణం చేసే అవకాశం ఒక్క ఆర్టీసీ సంస్థ మాత్రమే కల్పిస్తుందని, అందుకే ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాలని సర్పంచ్ పుష్పలత-తిరుపతి కోరారు. మండలం నుండి ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రజలు విద్య, వ్యాపార అవసరాలకు వరంగల్‌కు వెలుతుంటారని, డైరెక్ట్ బస్సు సరైన సమయంలో లేక ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారని, తక్షణమే మండలకేంద్రం నుండి ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభించి రవాణా సౌకర్యార్థం కల్పించి ఆర్థిక బారం తగ్గించాలని వినతిని అందజేసినట్లు సర్పంచ్ జవ్వాజి పుష్పలత-తిరుపతి తెలిపారు. ప్రజల కోరిక మేరకు ప్రతిరోజు భూపాలపల్లి నుండి మహదేవపూర్, పలిమెల మీదుగా ముకునూరు వరకు నడిచే ఆర్టీసీ బస్ సర్వీసును ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలకేంద్రం వరకు పొడిగించాలని ఆర్టీసీ అధికారులను వారు కోరారు. ఆర్టీసీ బస్సులు ఉద్యోగులకు, ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా సమయపాలన పాటించినట్లయితే ప్రజలు ఉద్యోగులు ఎవరూ కూడా ప్రయివేట్ వాహనాలను అశ్రయించే అవకాశం ఉండదని అధికారులు బస్సులను సమయపాలన పాటించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్‌సి చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యులు సూరిబాబు, అంగన్‌వాడీ టీచర్ సుశీల, జనగామ మధూకర్, రవీందర్, అశోక్, భాస్కర్, పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మండలాల్లో ఘనంగా ఎమ్మెల్సీ సిరికొండ జన్మదిన వేడుకలు



చిట్యాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త

తెలంగాణ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలను నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గిద్ద ముత్తారంలో గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి, నైన్‌పాకలో కుమార్ యాదవ్, గోపాలపురంలో, మండలకేంద్రంలో టిఆర్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి చింతల రమేష్ ఆధ్వర్యంలో మధుసూదనాచారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ..సిరికొండ మధుసూదనాచారి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం సిఎం కేసిఆర్‌తో కలిసి ముఖ్య భూమిక పోషించారని గుర్తు చేశారు. శాసనసభ తొలి స్పీకర్‌గా పని చేస్తూ జిల్లా అభివృద్ధి కోసం అవిరాల కృషి చేశారని తెలిపారు. మధుసూదనాచారి మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు కామిడి రత్నాకర్ రెడ్డి, సర్పంచ్‌లు పోలవేణీ పోషాలు, నాయకులు కర్రె అశోక్ రెడ్డి, కన్నెబోయిన అశోక్, పోరెడ్డి సుదర్శన్ రెడ్డి, చంద్రమౌళి, కుమారస్వామి, రామ్‌చందర్, గురుకుంట్ల కిరణ్, శ్రీకాంత్, కిరణ్, ఆనందం, విజేందర్, నాగరాజు, కాట్రేవుల కుమార్, గణపతి, శ్రీనివాస్, కసిరెడ్డి రత్నాకర్ రెడ్డి, సంతోష్, బాలకృష్ణ, చింతల సుమన్, భీమ్ రావు, మల్లక్క, పుష్పక్క, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రేగొండలో..**

తెలంగాణ రాష్ట్ర తొలి శాసన సభాధిపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసుదనా చారి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ముఖ్య కూడలిలలో బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మధుసుదనాచారి అభిమానులు టిఆర్ఎస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని టిఆర్ఎస్ నాయకులు మధుసూదనచారికి శుభాకాంక్షలు తెలిపేందుకు ఆరు వాహనాలలో హైదరాబాదుకు తరలి వెళ్లారు. టిఆర్ఎస్ జిల్లా నాయకులు లెంకల రాజిరెడ్డి, మాజీ ఎంపిపి ఈర్ల సదానందం, మాజీ పిఏసిఎస్ చైర్మన్ గోపు భిక్షపతి, టిఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి వావిలాల రమేష్, టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోగుల అశోక్ రెడ్డి, ఎంపిటీసీ శనిగరపు వెంకన్న, సర్పంచ్‌లు అంబాల చందు, జంగేటి నరేష్, మాజీ సర్పంచ్‌లు అన్నరపు రాజు, మేడిపల్లి అశోక్, రేగొండ పట్ట యూత్ అధ్యక్షుడు మాడాగాని నరేష్ గౌడ్, టిఆర్ఎస్ నాయకులు సూర నర్సింగా రావు, సుబాష్, బోయిని వినోద్, మడికంటి మహేందర్, బూర్గుల ప్రభాకర్, తడక శ్రీకాంత్ గౌడ్, పసుల అశోక్, బింగి భిక్షపతి, గుర్రాల సుమన్ రెడ్డి, మడగాని సురేష్ గౌడ్, చిలువేరు ఐలుమల్లు తదితరులు పాల్గొన్నారు.





**మొగుళ్లపల్లిలో..**

సమాజ సంక్షేమానికి ప్రజ్వరిల్లిన తేజం మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో సిరికొండ జన్మదిన వేడుకలను స్థానిక ఎంపిటీసీ ఎర్రబెల్లి వనిత-పున్నం చందర్ రావు, ఇస్సినేట సర్పంచ్ కోడారి సునీత-రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంపకాలు చేసుకున్నారు. వృద్దులకు పండ్లు పంపిణీ చేశారు. డబ్బు చప్పుళ్ల, మహిళల కోలాట నీత్యాలతో మండలకేంద్రం సందడిగా మారింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో మధుసూదనచారి పాత్ర మరువ లేనిదని, రాష్ట్ర సాధక రథసారధి ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదీష్షలతో ప్రొ. జయశంకర్ పేరు మీద జిల్లాను ఏర్పాటు చేసి ఈప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చరన్నా రు. నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు తీసుకు వచ్చి మోడల్ నియోజకవర్గంగా తయారు చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోటే ధర్మరావు, సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు దానిబోయిన రాములు, సర్పంచ్‌లు గూడెపు శ్రీనివాస్, తిప్పారపు యుగేంధర్, క్రిష్ణరెడ్డి, మంద స్వామి, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## గుత్తికోయ గూడెంలో కార్డెన్ సర్చ్

**-మావెయిస్టులను ఎవరూ సహకరించ వద్దు**

**-పలిమెల ఎస్ఐ కె.అరుణ్**

పలిమెల, అక్టోబర్ 13, ప్రభాతవార్త



మావోయిస్టులకు ఎవరూ కూడా సహకరించ వద్దని పలిమెల ఎస్ఐ కె.అరుణ్ అన్నారు. పలిమెల గ్రామ పరిధిలోని గుత్తికోయ గూడెంలో ఎస్ఐ అరుణ్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనంతరం గిరిజనులతో మాట్లాడుతూ..మావోయిస్టులు ప్రభుత్వ విరోధకులని. ప్రజలకు మాయమాటలు చెప్పి వారి అర్థంలేని సిద్ధాంతాలకు ఉపయోగించుకుంటారని అన్నారు. మావోయిస్టులకు సహకరించే ప్రజలు కూడా సంఘ విద్రోహులుగా నిలుస్తారని, సహకరించిన వారికి ప్రభుత్వపరంగా కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. అనంతరం గూడెంలోని చిన్న పిల్లలకు బిస్కట్లు పంపిణీ చేశారు. క్రీడలు, చదివించడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ అరుణ్ వెంట సివిల్, సిఆర్‌పిఎఫ్ జవాన్‌లు పాల్గొన్నారు.

## విఆర్ఏల నిరవధిక సమ్మె విరమణ

**-విరమణ లేఖను తాసీల్దార్‌కు అందజేసిన విఆర్ఏలు**

**-సమ్మెలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపిన విఆర్ఏలు**

కాటారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త



నిరవధిక సమ్మె మరోమారు ప్రభుత్వం మాటలు నమ్మి ఒక్క ఛాన్స్ ఇచ్చి విరమిస్తున్నామని, ఒకవేళ ప్రభుత్వం ఇచ్చిన సమయంలోగా సమస్యలు పరిష్కరించకుంటే 81వ రోజు నుండి రాష్ట్ర వ్యాప్తంగా విఆర్ఏలందరూ తిరిగి నిరవధిక సమ్మెలో కొనసాగిస్తామని విఆర్ఏల సంఘం జిల్లా జాక్ కో-చైర్మన్ బందెల జితేందర్ హెచ్చరించారు. ఈమేరకు గురువారం విఆర్ఏల నిరవధిక సమ్మె విరమిస్తున్నట్లు కాటారం తీసాల్దార్ తిప్పర్తి శ్రీనివాస రావుకు అందజేశారు. విఆర్ఏల నిరవధిక సమ్మెలో సహయ, సహకరాలు అందజేసిన వారందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో విఆర్ఏల సంఘం మండల చైర్మన్ పట్టి లక్ష్మయ్య, జిల్లా కన్వీనర్ బొడ్డు సతీష్, మండల విఆర్ఏలు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సయిజ్ దాడులు

**-ముగ్గురిపై కేసు నమోదు**

కాటారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త

కాటారం మండలంలోని గుంద్రాత్‌పల్లి, గంగారం గ్రామాలలో గురువారం కాటారం ఎక్సయిజ్ సిఐ మాటేటి ప్రశాంతి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈదాడుల్లో 25లీటర్ల గుడుంబా, 200లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా భూక్య సారయ్య, భూక్య కుమార్, అంకిరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు సిఐ ప్రశాంతి తెలిపారు. ఈదాడుల్లో సిఐ వెంట ఎక్సయిజ్ సిబ్బంది ఉన్నారు.

జయశంకర్ వార్త
భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

# ఐటిడిఏ పివోను కలసిన నాయకులు




*కోల్‌బెల్ట్, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

ఏటూరునాగారంలో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకులు కలసి పలు సమస్యలపై ఐటిడిఏ పివో అంకిత్‌ను గురువారం వినతి పత్రంను అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నాయక్‌పోడ్‌ల ఆరాధ్య దైవం అయిన లక్ష్మీదేవర గుడి, కమ్యూనిటి హాల్ నిర్మాణం కోసం ఎకరం స్థలంను కేటాయించాలని, అత్యధికంగా ఆదివాసీలు కలిగిన మహాదేవ్‌పూర్‌లో ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని, చిట్యాలలో ఆదివాసీ విద్యార్థుల కోసం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బద్ది సమ్మయ్య, ఎంపిటీసీ బొడ్డు సమ్మయ్య, సంఘం నాయకులు ముంజం సారయ్య, కల్నేని సాంబయ్య, పెద్ది పోషయ్య, భీముని శరత్, త్రిజేసి వెంకట్రాజం, భీముని సారయ్య, మేకల తిరుపతి, గంప వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## షీల్డును బహుకరించిన జీఎం

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



52వ రక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని సింగరేణి వ్యాప్తంగా కాలనీలలో తనిఖీ చేసిన తనిఖీ బృందం, ఉత్తమ నిర్వహణకు గాను భూపా లపల్లి ఏరియా ఎలక్ట్రికల్ విభాగంకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా వచ్చిన షీల్డును జీఎం బళ్లారి శ్రీనివాసరావు అధికారులకు అందజేశారు. అధికారులు రామలింగం, రమేష్‌బాబు, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాస్‌కుమార్, జి వేణు, సారయ్య, గోపినాద్ పాల్గొన్నారు.

## ఆసరా పించన్ కార్డు పంపిణీ

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



భూపాలపల్లి మున్సిపాలిటి పరిధిలోని లక్ష్మీనగర్ 22వ వార్డులో రెండు నెలల క్రితం సయ్యద్ హుస్సేన్ అనారోగ్య కారణాలతో మరణించగా ఆయన భార్య రజియా సుల్తానాకు ఆసరా పించన్ కార్డును స్థానిక కౌన్సిలర్ ముంజాల రవీందర్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు నరిగె సమ్మయ్య, ఆపరేటర్ రాజు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రధానం

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని మంజూర్ నగర్ ఇల్లందు క్లబ్‌లో గురువారం కంపనీ స్థాయి కల్చరల్ మీట్ నిర్వహించగా విజేతలకు జీఎం బళ్లారి శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. కంపనీ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని కోలిండియా పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందని వెల్లడించారు. అధికారులు అజ్మీర తుకారం, రామలింగం, యూనియన్ నాయకులు కొక్కుల తిరుపతి, మోటపలుకుల రమేష్, కో ఆర్డినేటర్ పాక శ్రీనివాస్, పర్స శ్రీనివాస్, ఉత్తమ్‌కుమార్ మల్లిక్, రంజిత్, న్యాయ నిర్ణేతలు ప్రవీణ్, రంగా జ్యోతి పాల్గొన్నారు.

## ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేసి సాధా బైనామా ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల గోస తెలంగాణ ప్రభుత్వంకు పట్టడం లేదని, ఇప్పటి వరకు సాదాబైనామా కోసం ధరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేయటం లేదని ఆరోపించారు. దీంతో రైతుబంధు, భీమా సదుపాయం కోల్పోతున్నారని అన్నారు. ధరణి పోర్టల్ కేవలం భూస్వాములకు వరంగా మారిందని, ఇప్పటి వరకు రైతు బందు రాని రైతులకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బట్టు రవి, జిల్లా నాయకులు కంబాల రాజయ్య, సుర మహిపాల్, నాంపల్లి కుమార్, లావుడియా శ్రీనివాస్, గట్ల శ్రీనివాస్, తాండ్ర హరీష్, రాజు, రవి పాల్గొన్నారు.

## డిసెంబర్ 12న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

2022-23 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష డిసెంబర్ 12న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం రాజేందర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి బానోతు జుమ్మునాయక్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాస్టల్ సౌకర్యం లేని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని, ఈనెల 28వ తేదీ వరకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్షిక ఆదాయం 3 లక్షల 50 వేలకు మించి ఉండరాదని, గత సంవత్సరం ఏడవ తరగతి పరీక్ష ఉత్తీర్ణత కావాలని తెలియజేశారు. జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలల్లో చదువుతూ హాస్టల్ వసతి లేనటువంటి విద్యార్థులు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సిరికొండ జన్మదిన వేడుకలు

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

ఎంఎల్‌సి, తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి సిరికొండ మదుసూదనాచారి 67వ జన్మదినం సందర్భంగా ఆచార్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి సదానందచారి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి బాణసంచా పేల్చారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, భూషణం, సాంబమూర్తి, దామోదర్, రమేష్, సురేష్, రవి, రాజు, శేఖర్ పాల్గొన్నారు.



## అర్హత కలిగిన పేదలకు డబుల్ బెడ్‌లను కేటాయించాలి

*కోల్‌బెల్ట్, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

అర్హత కలిగిన పేదలకు డబుల్ బెడ్ రూంలను కేటాయించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నాగుల అరవింద్ కోరారు. గురువారం భూపాలపల్లి డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం అరవింద్ మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణంలో 960 పై చిలుకు డబుల్ బెడ్ రూంలను నిర్మించగా నేటి వరకు లబ్దిదారులకు కేటాయించలేదని ఆరోపించారు. ఇంత వరకు అర్హత కలిగిన పేదలను గుర్తించలేదని, నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు శిధిలం అవుతున్నాయన్నారు. నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూంలను పేదలకు అందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, తిరుపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## జీఎం కార్యాలయం ముందు కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

*భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్టులలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గురువారం సింగరేణి జీఎం కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. గత కొంత కాలంగా సింగరేణి సంస్థ తమ గుత్తేదారుకు డబ్బులు చెల్లించనందున పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించటం లేదని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. భూపాలపల్లి ఏరియాలోని కేటికే ఓసీపీ 2,3లలో ఓబి పనులను ఎస్‌వికెసి కంపనీకి అప్పగించగా గత కొంత కాలంగా బిల్లులను చెలించటం లేదు. గత నెలలో బిల్లులను చెల్లించటంలో జాప్యం చేస్తున్నారనే కారణంతో ఓబి పనులను నిలిపివేశారు. తాజాగా సింగరేణి సంస్థ గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవటంతో సుమారు 1000 మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించలేక పోయింది. దీంతో సంబంధిత కాంట్రాక్ట్ కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో సింగరేణి అధికారులు త్వరలో బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామనే హామీతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి ఏరియాలోని ఓబి పనులు చేస్తున్న గుత్తేదారుకు సింగరేణి సంస్థ ఇప్పటి వరకు 15 కోట్లను చెలించాల్సి ఉంది.



# విజేతలకు బహుమతులు అందజేత





గార్ల, అక్టోబర్13 ప్రభాతవార్త: జాంకీరాజ్ మెమోరియల్ ఆధ్వర్యంలో బంజారా యువజన సేవా సంఘం నిర్వహించిన నాలుగు జిల్లాల క్రీడాపోటీలు, డ్యాన్స్ బేబీడ్యాన్స్, ముగ్గుల పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. శ్రీవేట వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మర్రిగూడెం గ్రామంలోని మినిస్టేడియంలో ప్రతియేటా నిర్వహిస్తున్న క్రీడాపోటీలలో భాగంగా క్రీడాముగింపు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో గార్ల, బయ్యారం ఎస్సైలు బాణోత్ వెంకన్న, రమాదేవి,లు ముఖ్య అతిధులుగా పాల్గొని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత రైల్వే ఉన్నతాధికారి భూక్య కస్నానాయక్, బిఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జోగిరాం నాయక్, సంఘం సభ్యులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామీణ క్రీడలతో క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీయడమే కాక, మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందించబడున్నారు. ఆటల, కళల నైపుణ్యాలను పెంపొందించడానికి, క్రీడాకారులను, కళాకారులను ప్రోత్సహించడానికి ప్రతియేటా క్రీడలు, డ్యాన్స్ బేబీడ్యాన్స్, మహిళలకు ముగ్గుల పోటీలను స ంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగి ప్రముఖ రచయిత సేవాగుణం, ప్రజలమన్ననలను పొందుతున్న బూడిద అరుణ్‌గౌడ్, ఆలయ ప్రధానకార్యదర్శి బూడిదరాణి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళలు గిరిజన సాంప్రదాయ దుస్తులను ధరించి నెత్తిమీద బిందేలనుభూని గిరిజన నృత్యాలను ప్రదర్శించారు. నిర్వహించిన కబడ్డీపోటీలలో పుటాన్‌తండా టీం(ఖమ్మం) ప్రథమస్థానంలో, బయ్యారం మండలం టీం ద్వితీయస్థానంలో, గార్లమండల శేరిపురంగ్రామ టీం తృతీయస్థానంలో, బోటిగుంపు (ఇల్లందు) టీం నాల్గవ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారని, డ్యాన్స్ బేబి డ్యాన్స్‌లో ఇల్లందు బ్లూమూన్స్ డ్యాన్స్ గ్రూపు ప్రథమస్థానంలో, గోవింద్రాల దాస్యడ్యాన్స్ గ్రూపు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారని, ముగ్గుల పోటీలలో ఎం.అంజలీ ప్రథమస్థానం, ఇస్లావత్ మీనాక్షి ద్వితీయ స్థానం, రన్నింగ్ పోటీలలో ఇస్లావత్ గణేష్, బి.సందీప్ మొదటిస్థానంలో నిలవగా బహుమతులు అందజేయడం జరిగిందని క్రీడల సంఘం అధ్యక్షులు భూక్య రాంసింగ్ తెలిపారు. ఈకార్యక్రమంలో రైల్వేరిటైర్డ్ ఉన్నతాధికారి భూక్య కస్నానాయక్, బిఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జోగిరాంనాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ అక్ష్మణ్‌నాయక్, సిపిఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు భూక్య రాంసింగ్, ఉపాధ్యక్షులు బాణోత్ చిరంజీవి, గేమ్స్ కార్యదర్శి భూక్యరమేష్, కార్యదర్శి మూడ్ జవహర్‌లాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాళోత్ శాంతికుమార్, నిర్వహకులు భూక్యహరి, చిరంజీవి, తెలంగాణ యాదవసంఘం జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజు, ప్రముఖులు, గెలుపొందిన క్రీడాకారులు, తదితరులున్నారు.

## మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి



కురవి, అక్టోబర్ 13, ప్రభాతవార్త: ఇటీవల మృతి చెందిన సునీల్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 8న అర్ధరాత్రి మిత్రులతో కలిసి వెళ్లిన తన కుమారుడు మృతి చెంది విషాదం నింపారన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మాకు న్యాయం చేయాలని కోరుతూ సునీల్ మృతికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నాయకులు డివై గిరి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, హరిలాల్ మద్దతు తెలిపారు. కురవి సిఐ రవికుమార్ ధర్నా వద్దకు చేరుకొని మృతుని పోస్టుమార్టం ఆధారంగా మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంపై ధర్నాను విరమించుకున్నారు. ఈ ధర్నాలో అనిల్, వంశీ, అజయ్, యశ్వంత్ సాయి, తేజ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న నూతన మండల కార్యాలయాలు



కురవి, అక్టోబర్ 13, ప్రభాతవార్త: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా కొత్త మండలాలను ప్రకటించిన విషయం విదితమే. దానిలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం నుండి నూతన మండల కార్యాలయాలను ఏర్పాటుచేయాలని ఆదేశాలు అధికారులకు రావడంతో వెంటనే కొత్తగా ఏర్పడిన మండల కే ంద్రంలో కార్యాలయ ఏర్పాటుకు అధికారులు సిద్ధమయ్యారు. దానిలో భాగంగా గురువారం మండలంలోని సీరోలు మండల కేంద్రాన్ని ఏర్పాటుచేయగా ఈ నెల 17న డోర్నకల్ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయం ప్రారంభానికి ముస్తాబు కాగా మిగతా కార్యాలయాల కోసం గ్రామంలో అద్దె భవనాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.

## అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి



మరిపెడ, అక్టోబర్ 13, ప్రభాతవార్త: అక్రమాలకు పాల్పడుతున్న షాప్ నెం.1 రేషన్ డీలర్‌పై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని గుండెపుడి సిపిఎం గ్రామ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గురువారం డిప్యూటీ తహశీల్దా నాగేంద్ర ప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సంఘం ఆధ్వర్యంలో అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గుండెపుడి గ్రామంలోని ప్రభుత్వ చౌకధరల దుకాణం షాపు నెం.1 రేషన్ డీలర్ రేషన్‌కార్డుదారులకు ఒక కేజి నుండి రెండు కేజీలకు రేషన్ బియ్యం తూకాలలో అవకతవకలు జరుపుతూ పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. డీలర్ అక్రమాలపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకొని రేషన్ కార్డు దారులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బానాల రాజన్న, కందాల రమేష్, అల్లి శ్రీనివాస్ రెడ్డి, మధుసుధన్, వీరన్న, షరీఫ్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ డిప్లొమా కోర్సులకు రఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఫత్తేపురం గ్రామంలో కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటుచేశారు. గురువారం విశ్వధారణి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మహర్షి ఈ కళాశాలలో హార్టికల్చర్ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 20 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కోర్సుకు 10, ఇంటర్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నెం.90630 19018కి సంప్రదించాలన్నారు.

## వాక్ ఇన్ ఇంటర్వ్యూ..

ఎడ్యుకేషన్ కేయూ, అక్టోబరు 13, ప్రభాతవార్త: కేయూ ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా (మేల్ అండ్ ఫిమేల్) పనిచేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు అక్టోబరు 17(సోమవారం) మధ్యాహ్నం 4గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమతమ ఎంబీబీఎస్ అర్హతతో హాజరు కావచ్చునని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.35వేలు, కన్సాలిడేట వేతనం ఉంటుందని, ప ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు హాజరు కావచ్చునన్నారు.



మహబూబాబాద్ వార్త

మహబూబాబాద్, తొర్రూరు

## సమ్మె విరమించిన వీఆర్ఏలు



మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13, ప్రభాతవార్త: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ వీఆర్ఏల సమస్యలను పరిష్కారం చేస్తామని వీఆర్ఏల రాష్ట్ర కమిటీతో జరిపిన చర్చలలో హామీ ఇవ్వగా గురువారం జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు గత 80 రోజులుగా వీఆర్ఏలు చేస్తున్న సమ్మెను రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె విరమించారు. దానిలో భాగంగా తమను విధుల్లోకి తీసుకోవాలని తహశీల్దారు నాగభవానికి సమ్మె విరమణ లేఖను అందచేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల జెఎసి మండల కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13, ప్రభాతవార్త: దేశంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు ఈ నెల 14 నుండి 18 వరకు విజయవాడలో జరగనున్న సిపిఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి తండ సందీప్ కోరారు. గురువారం మండలంలోని ముడుపుగల్ గ్రామంలో మహాసభల గోడపత్రికలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తండ సతీష్, గుణిగంటి శేఖర్, ఎడెల్లి యల్లయ్య, జుజ్జూరి సాయి, తేజావత్ శ్రీనివాస్, కొంపెల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

## నలంద పాఠశాలపై ఇప్పటివరకు చర్యలేవి

తొర్రూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త: తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని నలంద పాఠశాల అర్హత లేకున్నా చదువు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి భారీ మొత్తలో వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని గతంలోని విద్యాధికారుల విచారణలో తేలినప్పటికీ ఇప్పటివరకు ఆ పాఠశాల యజమానులపై విద్యాశాఖాధికారులపై చర య్యలు ఎందుకు తీసుకోవడం లేదని వివిధ సంఘాల నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దానిలో భాగంగానే కొన్ని సంఘాల నాయకులు గురువారం డివిజన్ కేంద్రంలోని జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నలంద పాఠశాల పేరుకు బదులుగా శ్రీచైతన్య పాఠశాల పేరుతో యథేచ్ఛగా నడుపుతున్న యజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా నలంద కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకొని ఆ పాఠశాలను సీజ్ చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు విజేందర్, శ్యాం మహర్, వినీత్, సాయి, శంకర్, సందీప్, ప్రవీణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

## లంబాడ హక్కుల పోరాట సమితి మహిళా జిల్లా కమిటీ ఎన్నిక

తొర్రూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త:



లంబాడ హక్కుల పోరాట సమితి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా మండల కేంద్రంలోని దుబ్బతండకు చెందిన ధరావత్ దేవిని ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సంఘనాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలో మహిళా సమస్యలపై పోరాడతానన్నారు.




## ఎమ్మెల్యే సీతక్కకు డాక్టరేట్‌పట్ల హర్షం

నెల్లికుదురు,అక్టోబర్ 13,ప్రభాతవార్త



ఆదివాసి బిడ్డ ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్కకు ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు యువజన కాంగ్రేస్ నాయకులు,స్థానిక వార్డు సభ్యులు వరిపెల్లి పూర్ణచందర్ తెలిపారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... సామాన్య ప్రజలతోపాటు,ఆదివాసి,ఆడవి బిడ్డల ఆకలికేకలు,ఆర్తనాదాలను తెల్సుకుని ఉవ్వేత్తున ఎగిసిపడుతున్న కరోన సమయంలో మూటను నెత్తినపెట్టుకుని వాగులు,వంకలు పొర్లుతున్న ఆడవి బిడ్డల ఆకలిని తెల్సుకుని తీర్చి,బతుకుపై భరోసా కల్పించిన ప్రజానాయకురాలు సీతక్క అని కొనియాడారు.అనునిత్యం అణగారిన ప్రజల్లో చైతన్యం కోసం అహర్నిషలు శ్రమిస్తూ,తీరికలేని సమయంలోనైనా ఉన్న సమయాన్ని వినియోగించుకుని పుస్తక పఠనంతో డాక్టరేట్ సాధించడం నిజంగా గర్వకారణని,ఎమ్మెల్యే సీతక్క ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నారు.

## రామునాయక్ భారతసేవ రత్న అవార్డు

నెల్లికుదురు,అక్టోబర్ 13,ప్రభాతవార్త



వల్లూరి ఫౌండేషన్ చేర్మెన్ డాక్టర్ విఆర్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆడిటోరియంలో భారతసేవ రత్న అవార్డును తాను అందుకున్నట్లు గుగులోతు రామునాయక్ తెలిపారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... తాను చేపడుతున్న సామాజిక సేవలను గుర్తించి ఫౌండేషన్ ఈ అవార్డును అందచేయడం పట్ల సంతోషంగా ఉందన్నారు.రాబోవు రోజుల్లో ప్రజలకు సేవకార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు.అవార్డు అందచేసిన ఫౌండేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## రైతులను మోసం చేస్తున్న కార్పోరేట్ రంగాలు

చిన్నగూడూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేసింది ఏమీ లేదని వ్యవసాయం చేసే రైతుల నడ్డి విరుస్తూ కార్పోరేట్ రంగాలకు మేలు చేస్తున్నారని రైతు సంఘం మండల సభ్యులు కందుకూరు సుధాకర్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని దాశరధి సెంటర్లో ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, పంట నష్టానికి గురైతే ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా 11 నెలలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం జరిగిందన్నారు. ఈ నెల 15,16 తేదీలలో కేసముద్రంలో హరిహర గార్డెన్స్ లో జరగబోవు జిల్లా రైతు మహాసభలకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, వీరన్న, రైతు సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిగూడెంలో యువతి అదృశ్యం

రఘునాథపల్లి, అక్టోబరు 13, ప్రభాతవార్త:

మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువతి ఈనెల 12న బుధవారం రోజు మధ్యాహ్నం సమయం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు తెలిసిన వారి ఇళ్లలో, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా యువతి జాడ తెలియకపోవడంతో గురువారం యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అధికారులు ఈ రోడ్డు సంగతేమిటీ..?

### మంత్రి నియోజకవర్గంలో రోడ్డుపరిస్థితి ఇదా..!

పెద్దవంగర,అక్టోబర్ 13,ప్రభాతవార్త



మండల కేంద్రంలోని చిన్నవంగర పరిధిలోని కిష్టుతండ వద్ద ప్రధాన రహాదారికి మూడేళ్లుగా ఎలాంటి మరమ్మత్తులు చేయకపోవడంతో ఎక్కడికక్కడ గోతులు పడి జనం మృత్యువు అంచున ప్రయాణం చేస్తున్నారు.ఇటివల కురిసిన వర్షాలకు గ్రామాలలోని రోడ్లే కాకుండా తిరుమలగిరి -తొర్రూరు ప్రధాన రహాదారి లోతైన గుంతలు ఏర్పాడ్డాయి.గుంతలు పూడ్చేందుకు గుత్తేదార్లను అధికారులు ప్రాధేయపడుతున్న ససేమిరా రాలేమంటున్నారు.పాడైపోయిన రోడ్ల గురించి పెద్దవంగర,తొర్రూరు మున్సిపాలిటి అధికారులు కనీసం మాట్లాడటానికి ఇష్టపడటం లేదంటే సమస్య తీవ్రత అద్దం పడుతోంది.నిత్యం మండల అధికారులు మొదలు జిల్లా అధికారులంతా ప్రయాణించే రోడ్డు మార్గంలో అడుగుకో గుంత,గజానికో గోతిలా పరిస్థితి తయారైంది.సాక్షాత్తు పాలకుర్తి నియోజక శాసన సభ్యులు,రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న దారుల రాత మారని పరిస్థితి.ఏ అధికారిని కదిలించిన డబ్బు లేదు,గుత్తేదారులు రావడంలేదనే సమాధానం ఎదురవుతోంది.పెద్దవంగర నుండి తొర్రురు వరంగల్ హైవె కలిసేచోట అర్‌అండ్‌బి రహాదారి పరిస్థితి ఇలాగే తయారైంది.ఈ రహాదారి గోతులు పడి ఆధ్వానంగా మారినా కనీసం మరమ్మత్తులు చేయడం లేదు.గతంలో వర్షాకాలానికి ముందుగా అర్‌అండ్‌బీ అధికారులు రహాదారులకు మరమ్మత్తులు చేసి వానలకు తట్టుకునేలా చర్యలు చేపట్టేవారు.అయితే మూడేళ్లుగా రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయకపోవటంతో ఏరోడ్డు చూసిన గుంతలమయంగా మారింది.గోతులమయంగా మారిన రోడ్లపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.నిత్యం ప్రజా ప్రతినిధులు తిరుగుతున్న రోడ్లకూ కనీస మరమ్మత్తులు చేయటంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇకనైన ప్రజా ప్రతినిధులు,అధికారులు పట్టించుకొని రోడ్డు మరమ్మత్తులు చేయాలని,స్వయాన మంత్రి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఇదా అని,వెంటనే స్పందించి రోడ్ల మరుమత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## నామినేషన్‌కు మండల బిఆర్ఎస్ నాయకులు

పెద్దవంగర,అక్టోబర్ 13,ప్రభాతవార్త



మండల కేంద్రంలోని పలు గ్రామాల బిఆర్ఎస్ నాయకులు మండల కేంద్రం నుండి మునుగోడు ఎంఎల్ఏ అభ్యర్ధి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నామినేషన్‌కి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య,మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ ఆధ్వర్యంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.వెళ్లిన వారిలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు నేహ్రూనాయక్,మాజీ మండల పార్టి అధ్యక్షుడు పాలకుర్తి యాదిగిరి రావు,మాజీ ఏఎంసి చైర్మన్ సోమనర్సింహరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్‌కుమార్,మండల ఉపాధ్యాక్షుడు వెంకన్న,మండల అధికార ప్రతినిధి బనోతు సోమన్న నాయక్,బిఆర్ఎస్ నాయకులు శ్రీరాం సుధీర్‌రెడ్డి,రాజు యాదవ్,ఉపేందర్ రెడ్డి, విజయపాల్‌రెడ్డి, ఈరెంటి శ్రీనివాస్, వెంకట్రామయ్య, అశోక్,పూర్ణచందర్,కాసాని హరిష్,దంతాలపల్లి రవి,జలగం శేఖర్,యాకన్న, అనుదీప్,వెంకటేశ్,నగేష్,సమ్మయ్య,బానోతు చంద్రశేఖర్,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుక భిక్షపతి,సర్పంచ్‌లు ధారవత్ రాజేందర్,పటేల్ నాయక్,చింతల భాస్కర్,కార్యకర్తలు,నాయకులు తదితరులు వెళ్లారు.

## ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి

జఫర్‌గఢ్, అక్టోబరు 13, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు యాకన్న నాయక్ అన్నారు. గురువారం మండలంలోని తమ్మడపల్లి(జి) జిల్లాపరిషత్ స్కూల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇట్టి పాఠశాలలో సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, క్లాస్‌రూమ్‌లో క్లీన్‌చేసే స్వీపర్ కూడా లేకపోవడం, తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. వాటర్ ట్యాంక్‌కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, గ్రామపంచాయతీ నుంచి కూడా పూర్తి సహకారం లేకపోవడం, ప్రభుత్వం మన ఊరు మనబడికి కేటాయించిన నిధులు తక్షణమే విడుదల చేసి పాఠశాలల్లో మౌళికసౌకర్యాలు మెరుగు పర్చాలని డిమాండ్‌చేశారు. అంతేగాకుండా క్లాస్‌రూమ్‌లో పూర్తిస్థాయిలో టీచర్లు కూడా లేరని విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం బోధనకూడా అందించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు. పాఠశాలలోని సమస్యలు పరిష్కారం చేయకపోతే ఉద్యమి స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్జున్, మండల కార్యదర్శి తరుణ్‌నాయక్ పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

జఫర్‌గడ్, అక్టోబరు 13, ప్రభాతవార్త:

జఫర్‌గడ్ మండల శివారు వడ్డేగూడెం గ్రామానికి చెందిన పిన్నింటి ఉప్పలయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో మృతుడి కుటుంబానికి గ్రామపంచాయతీ వార్డుసభ్యులు మంచాల అనిల్ పరామర్శించి 50కేజీల బియ్యంను మృతుడి కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో నరసింహరాములు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



# సీతక్కను సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు

*గంగారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

ఉస్మానియా యూనివర్సిటీ నుండి పిహెచ్‌డి పట్టా పొందిన ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్కను గంగారం ఎంపిపి సువర్ణపాక సరోజనజగ్గారావు ఆధ్వర్యంలో ఆ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈమేరకు గురువారం గంగారం మండలం నుండి ములుగు తరలివెళ్లిన వీరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీతక్కను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. డాక్టరేట్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రసిడెంట్ పెనుక పురుషోత్తం, వైస్ ఎంపిపి ముడిగ



వీరభద్రపోతయ్య, సర్పంచ్ సారలక్ష్మికాంతారావు, సాంబయ్య, జనగాం కృష్ణస్వామి, రామస్వామి మహిళకార్యదర్శి ఈసం నర్సక్క, అక్కపెల్లి పాల్గొన్నారు.

## మార్కెట్ అభివృద్ధికి ప్రణాళికలు

*కేసముద్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*




కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చైర్మన్ మ ర్రి నారాయణరావు వెల్లడించారు. వ్యవసాయా మార్కెట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మార్కెట్ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని నిర్ణయించారు. మరోవైపు మార్కెట్ ఆదాయాన్ని పెంచుకునే అంశాలపై చర్చించారు. మార్కెట్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సంకెపెల్లి జనార్ధన్‌రెడ్డి, బచ్చు పరమేశ్వర్, కార ్యదర్శి రాజు పాల్గొన్నారు.

## మండల పరిషత్‌ను సందర్శించిన సిఇఓ

*గూడూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

గూడూరు మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీసిఇఓ రమాదేవి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఉపయోగించగా మిగిలిన ఎన్నికల సమాగ్రిని పరిశీలించి తొలిగించారు. అనంతరం ఎంపిడిఓ చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో నేషనల్ పంచాయతి అవార్డ్సు కొరకు సమర్పించాల్సిన నివేదికలపై చర్చించారు. అధికారులు తమ నివేదికలను సకాలంలో సమర్పించి అవార్డుల ఎంపికకు సహకరించాలని సిఇఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విజయలక్ష్మి, ఎంపిఓ ప్రసాదరావు, సూపరిండెంట్ కరణ్‌సింగ్, ఇమామ్, నాగరాజు పాల్గొన్నారు.



## మునుగోడులో టిఆర్ఎస్ మునిగిపోతుంది

**బిజెపి ములుగు జిల్లా**

**అధ్యక్షులు భాస్కర్ రెడ్డి**

*వెంకటాపూర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :*

మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఓటమి ఖాయమని, బిఆర్ఎస్ పార్టీ పేరుతో కొత్త రాజకీయాలకు తెర తీశారని బిజేపి జిల్లా అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి అన్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు భూక్య జవహర్ లాల్



అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేసిఆర్, కేటిఆర్ ల నియంత పోకడలతో అప్పుల రాష్ట్రంగా చేశారని ఆయన తెలిపారు. టిఆర్ఎస్ అవినీతి పాలనలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరు ఊచలను లెక్క పెట్టాల్సిందేనని ఆయన పేరొ ్కన్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చ జిల్లా అధ్యక్షులు కొత్త సురేందర్, మండల అధ్యక్షులు గంగుల రాజ్ కుమార్, బిజెపి మండల ప్రధానకార్యదర్శి కరుణాకర్ రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, నాయకులు పత్తి నాగేశ్వర్ రావు, వీరస్వామి, అనిల్ రెడ్డి, దర్శన్, రమేష్, సంతోష్, సురేందర్, రవి, సాయిరెడ్డి, రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**బీఆర్ఎస్ మండల అధ్యక్షులు**

**సునీల్ కుమార్**

*ఏటూరు నాగారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త:*

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ ఏటూర్‌నాగారం మండల అధ్యక్షులు సునీల్ కుమార్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జాస్తి శ్రీలత భర్త శ్రీకాంత్ మరియు పిన్నోజు విజయలక్ష్మీలు ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకానికి దరఖాస్తు చేసుకోగా ములుగు



జెడ్పి చైర్మన్ కుసుమ జగదీష్ ప్రత్యేక చొరవతో జాస్తి శ్రీలతకు రూ. 28500, పిన్నోజు విజయలక్ష్మీకి రూ. 16500 లు మంజూరు చేయించారు. ఇట్టి చెక్కులను గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గడదాసు సునీల్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని మహోన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీం, ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, ఎంపీటీసీ కుమ్మరి స్వప్న చంద్రబాబు, ఎండి. అజ్మత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్లాంటేషన్ ధ్వంసం కేసులో ఐదుగురి అరెస్టు

*గూడూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

మండలంలోని బొల్లెపెల్లి గ్రామంలో అటవీశాఖ ప్లాంటేషన్‌లో మొక్కలు నిరికివేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన ఐదుగురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్‌గౌడ్ తెలిపారు. ప్లాంటేషన్ ధ్వంసంపై అటవీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసి ఈ సంఘటనకు పాల్పడినవారిని ఆరుగురిని గుర్తించడం జరిగిందని, ఇందులో భూక్య ఈర్య, బాదావత్ నెహ్రు, బానోతు శ్రీను, బోడ లక్ష్మి, బానోతు వెంకన్నలను గురువారం అరెస్టు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

## పాఠశాలకు ఫ్యాన్ల బహుకరణ

*కేసముద్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*



మండలంలోని ఇనుగుర్తి ప్రాథమిక పాఠశాల నుండి గురుకుల ప్రవేశపరీక్షలు రాసి సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలకు తమ వంతుగా ఫ్యాన్లు బహుకరించారు. ఈమేరకు గురువారం ఆ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పద్దెనిమిది మంది విద్యార్థులు ఈ పాఠశాల నుండి గురుకుల ప్రవేశ పరీక్షలు రాయగా అందులో 16 మందికి వివిధ గురుకులాల్లో ప్రవేశం లభించింది. దీనికి ఆనందం వ్యక్తం చేసిన ఆ విద్యార్థుల తల్లిదం డ్రులు పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతాబావంతో సన్మానం చేపట్టారు. వేసవిలో తమ పిల్లలకు ఉచిత శిక్షణను అందించిన హెచ్‌ఎం వెంకటేశ్వరాచారికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల పేరెంట్స్ ఎర్రం విజయ్, బేతమల్ల సురేస్, కొమ్మనబోయిన మహేందర్‌లు సతీసమేతంగా పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఎండి ఇస్మాయిల్, కె.రేవతి, పి.సారంగపాణి, జి.వైఢూర్యలు పాల్గొన్నారు.

## ఎఐకెఎస్ మహాసభలకు తరలిరండి

*కేసముద్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త*

కేసముద్రం మండల కే ంద్రంలో ఈనెల 15, 16 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైతు సంఘం (ఎఐకెఎస్) రెండవ జిల్లా మహాసభలకు పెద్దెత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మారుతునేని పాపారావు కోరారు. కేసముద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని హరిహర గార్డెన్స్‌లో నిర్వహించనున్న ఈ జిల్లా సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరును తిప్పికొట్టాలని పిలుపునివ్వనున్నట్లు తెలిపారు. రైతు వ ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న రాష్ట్రంలోని టిఆర్ఎస్ ప్రభుత్వాల పనితీరును ప్రతి ఒక్కరు ఎండగట్టాలని కోరారు. రాష్ట్రంలోని పోడు



రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. మండలలోని వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా మహాసభలకు రైతులు తరలిరావాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి జల్లె జయరాజు, యాకు బ్‌పాషా పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు
### జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**
జిల్లాలో నాన్‌కమ్యూనికేషన్ డిసీజెస్ ద్వారా సుమారు 2లోల 80వేల 888మందిని లక్ష్యంగా చేసుకున్నామని జనగామ జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య తెలిపారు. గురువారం జడ్పీకార్యాలయంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జడ్పీచైర్మన్ సంపత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ శివలింగయ్య పాల్గొని జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి, పురోగతిపై చర్చించారు. ఈసందర్భంగా ఎన్‌సీడీ కార్యక్రమం కింద జిల్లాలో30సంవత్సరాలు పైబడిన దాదాపు 2లక్షల 80వేల 888మంది లక్ష్యంగా కాగా, వారిలో వైద్యపరీక్షలు నిర్వహించగా 32వేల 665మందికి రక్తపోటు, సుమారు 14,939మందికి డయాబెటిస్ నిర్ధారణ అయినట్లు తెలిపారు. వీరందరికి ఉచితంగా ప్రభుత్వం మందులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మారుమూల గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటుచేసి ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కలి ంచాలని, వ్యాధిగ్రస్తులందరు ఉచితంగా మందులు పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా మండలస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలకు స్థానిక జడ్పీటీసీలు, ఎంపీపీలకు ఆహ్వానం అందడంలేదని, మండలస్థాయిలో అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని సభలో కలెక్టర్‌కు నివేదించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ మండలస్థాయి సమావేశాల్లో ప్రోటోకాల్‌ను తూ.చ.తప్పక పాటించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ పాటించే విధంగా సర్క్యులర్‌ను చేయాలని జడ్పీ సీఈవో వసంతను ఆదేశించారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. తరిగొప్పుల గ్రామంలో స్థానికంగా పీహెచ్‌సీ ఏర్పాటుకు సమావేశంలో ఆమోదించాలని కోరగా కలెక్టర్,జడ్పీచైర్మన్ స్పందించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానంతో ఆమోదం తెలిపారు. జిల్లాలో మన ఊరు మనబడి ద్వారా ఇప్పటివరకు 176పాఠశాలల్లో 610నులు గుర్తించామని, అందులో భాగంగా 12మండలాల్లో ప్రతీ మండలానికి రెండుపాఠశాలల చొప్పున మొత్తం 24నమూనా పాఠశాలలు గుర్తించి సివిల్ పనులు, దాదాపుగా పూర్తి కాగా కలర్స్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలాల్లో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న పనుల పురోగతి తీరుతెన్నులు, పన్నుల వివరాలను మండల అధికారులు, జడ్పీటీసీలకు, ఎంపీపీలకు అందించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. మండలాల్లో జరుగుతున్న వివిధ పనులు ఇతర వివరాలను జడ్పీటీసీ, ఎంపీపీలు కోరిన యెడల తప్పనిసరిగా పూర్తి వివరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జడ్పీచైర్మన్ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిర్మించిన శ్మశాన వాటికలను సత్వరమే వినియోగంలోకి తీసుకరావాలన్నారు. అలాగే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన 145శ్మశాన వాటికలను నిర్మాణాలు పూర్తికాగా, 136పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్మాణాలు చేపట్టగా వివిధ దశలలో పురోగతిలో ఉన్నట్లు శాఖ అధికారులు తెలిపారు. నవంబర్ 15వరకు జిల్లాలోని అన్ని శ్మశాన వాటికలను వాడుకలోకి తీసుకవచ్చేందుకు సంబంధిత శాఖ అధికారులు బృందంగా ఏర్పడి పర్యవేక్షించి పనులు పూర్తి అయ్యేవిధంగా కృషిచేయాలని కోరారు. 2022-23లో 1,68,447మంది రైతులకు 201.71కోట్ల రూపాయలను రైతుబంధు పథకం కింద నేరుగా రైతుల ఖాతాలో జమచేశామని తెలిపారు. అలాగే 13మంది రైతులకు రూ.63లక్షలను రైతుజీవిత భీమా పథకం కింద రైతులకు అందించడం జరిగిందని తెలుపుతూ రైతుబీమా పథకంపై ప్రతీ రైతుకు అవగాహన కల్పించి బీమా సౌకర్యం కల్పించేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చలివాగు నీరు నిలిపి వేశారాయే..



**భగీరథ నీరు రాదాయే!**
**కాంట్రాక్టర్ నిర్లక్ష్యం... అధికారుల అలసత్వం!**
**గల్లీలో పైపులైన్ వేయలేదాయే!**

**పరకాల- ప్రభాతవార్త**
పూర్తిగా పైపు లైన్ వేయక ముందే చలివాగు నుంచి సరఫరా చేసే నల్లా నీరు నలిపివేశారు. కొన్ని ప్రాంతాలకే వేసిన భగీరథ పైపు లైన్‌కు కనెక్షన్‌లు ఇచ్చారు. కొందరికి మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. పలువురు కౌన్సిలర్ల పరిధిలోని గల్లీల్లో ఇప్పటి వరకు వేయలేదు. ధైరమైన నల్లా కనెక్షణ్ ఇవ్వమంటే భగీరథ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. నీళ్ల కోసం అవస్థలు పడుతున్నారు. రూ.56కోట్ల వ్యయంతో చేపట్టిన మిషన్ భగీరథ పనులను ఆరు నెలల్లో పూర్తి ఉండగా, ఏడాది దాటుతున్న ఇంకా పనులు పూర్తి కాలేదు. ఆ పనులు పూర్తి కావడానికి ఇంకో ఏడాది పట్టేలా ఉందని, అప్పటి దాక నీళ్ల కోసం తప్పదని ప్రతిపక్ష నేతలు దుయ్యపడుతున్నారు. పరకాల పురపాలక సంఘం పరిధిలో ఇంటి నల్లా కనెక్షన్‌లు సుమారు 8వేల దాకా ఉంటాయి. వారందరికి నీరందించే భగీరథ నల్లా కనెక్షన్‌లు ఇవ్వక ముందే పంప్ హౌజ్ నుంచి వచ్చే నీటి సరఫరాను నిలిపి వేయడం పురపాలక సంఘం ఘనత అని ప్రజలు దుయ్యబడుతున్నారు. పైగా వంద శాతం నల్లాలు అమర్చినట్లు ప్రగ్భాలు పలుకుతున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. చాలు లేదు.. చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా భగీరథ పనులు పూర్తి కాకుండానే చలివాగు పంప్ హౌజ్ నీటి సరఫరా నిలిపి వేయడంను దుయ్యబడుతున్నారు. భగీరథ నల్లాలు అమర్చని ప్రాంతాలకు చలివాగు పంప్ హౌజ్ నీరైనా సరఫరా చేయాలని పలు ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అర్హత కలిగిన పోడు భూములు పట్టాలు
### జిల్లా కలెక్టర్ కె. శశాంక



**బయ్యారం, అక్టోబర్ 13, ప్రభాతవార్త:**
పోడు భూముల పట్టాల మంజూరులో రైతులకు సంబంధించిన పోడు భూములను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన పోడు భూముల రైతులకు పట్టాలు పారదర్శకంగా సర్వే నిర్వహించి ఇస్తామని జిల్లా కలెక్టర్ కె. శశాంక అన్నారు. గురువారం మండలంలోని మొట్ల తిమ్మాపురం గ్రామంలో పోడు భూముల సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పరిశీలించారు. అటవీ హక్కుల చట్టం నిబంధనల ప్రకారం సర్వే ప్రక్రియను నిర్వహించాలని అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయ ంతో ఎఫ్ఆర్సీ కమిటీలు సర్వే బృందాలకు సహకరిస్తూ అర్హత కలిగిన పోడు వ్యవసాయదారులకు పట్టాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎర్రయ్య, తహశీల్దార్ రమేష్, ఎంపీడీవో చలపతి రావు, అటవీ శాఖాధికారులు నాగవాణి, సువర్చల, తదితరులు పాల్గొన్నారు.

## ఓసీపీ పనులను పరిశీలించిన డైరెక్టర్



**భూపాలపల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
భూపాలపల్లి ఏరియాలోని కేటికే ఓసీపీ 02 పనులను గురువారం సింగరేణి డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఓసీపీ 02లో ప్రస్తుతం ఓబి తొలగింపు 88 శాతం మాత్రమే ఉండగా 100 శాతం రీచ్ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డైరెక్టర్ వెంట భూపాలపల్లి ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు, పీఓ వెంకట్రామిరెడ్డి, ఎస్ఓఎం బిక్షమయ్య, పీఈ యాదయ్య, అధికారులు నజీర్, రామక్రిష్ణ, శంకర్‌లు పాల్గొన్నట్లు అధికార ప్రతినిధి అజ్మీర తుకారాం తెలిపారు.

## రసాయన శాస్త్రంలో నాంపల్లి వెంకటేష్‌కు డాక్టరేట్

**ఎల్కతుర్తి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి వెంకటేష్ రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనకు ఉస్మానియావిశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. రసాయన శాస్త్రంలో నావల్ చార్జ్ ట్రాన్స్ఫర్ కాంప్లెక్స్ ఆఫ్ మల్టీసైట్ డోనర్స్ అండ్ పై ఆక్సెపర్టర్స్, సింథసిస్ఏ బైండింగ్ అండ్ డీఎఫ్టి (గ్యాస్ పెస్, పీసీఎం) స్టడీస్ అనే అంశంపై ప్రయోగాత్మక పరిశీల గ్రంధాన్ని ప్రొఫెసర్ టి.పార్థసారధి పర్యవేక్షణలోసమర్పించారు. తన పరిశోదన కాలంలో 11 పరిశోధన పత్రాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని తెలిపారు. మరో 4 పుస్తకాలను వ్రాసి ముద్రించినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేష్ డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్థులు స్నేహితులు అభినందించారు.

# జర్నలిస్టుపై అటవీ శాఖాధికారి దాడి
### దాడికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి.. అటవీశాఖ కార్యాలయం ముందు జర్నలిస్టుల ధర్నా



**మహబూబాబాద్ అగ్రికల్చర్, ప్రభాతవార్త**
ఇటీవల జిల్లాలోని గంగారం మండలంలో పోడు భూముల సర్వేలో భాగంగా సంబంధించిన అంశాలపై మన తెలంగాణ పత్రిక జర్నలిస్టు పల్లె సురేష్‌పై అటవీ శాఖ అధికారుల తీరు పట్ల ప్రశ్నించడంతో అతనిపై దాడి చేసిన ఫారెస్టు బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల సంఘాల నాయకులతో పాటు వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం మదర్‌థెరిస్సా సెంటర్లో జర్నలిస్టులు చేస్తున్న ఆందోళనకు పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనంతరం పర్కాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు పల్లె సురేష్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బీట్ ఆఫీసర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చుక్కల మధు, రంగా చౌదరి, ఫయాజ్, ఉదయ్‌ధీర్, రాంప్రసాద్, శ్రీహరి, కల్లూరి ప్రభాకర్, అట్రోజు రాజు, చందు, శెట్టి వెంకన్న, కిరణ్; సతీష్, బోనగిరి శ్రీనివాస్, సుభాని, మహేష్, సాయికుమార్, యశ్వంత్, ప్రవీణ్, ముఖేష్, వీరేందర్, నాయకులు అజయ సారధి, పెరుగు కుమార్, శశికుమార్, విద్యార్థి సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.